ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0

ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆసుపత్రుల్లో డీఎడిక్షన్ సెంటర్లు

ఏలూరు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): జాతీయ పొగాకు నియంత్రణ కార్య క్రమంలో భాగంగా ఏలూరు ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రుల్లో డీఎడిక్షన్ సెంటర్లను నిర్వ హిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తెలిపారు. ఏలూరులో శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ డీఎడిక్షన్ సెంటర్లలో మానసిక వైద్యనిపుణులతో పాటు, ఒక సైకాలజిస్టు ప్రతీరోజు అందు బాటులో ఉంటారన్నారు. వీటిలో ఉచిత వైద్యసేవలు అందుతాయన్నారు. ర్యాలీలో ఎన్‌సీడీ పీవో డాక్టర్ నరేంద్రకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చౌక డిపోల్లోనే రేషన్ సరుకుల పంపిణీ

ఏలూరు, మే 31(ఆంధ్రజ్యోతి):జిల్లాలో 1,123 రేషన్ దుకాణాల వద్దనే ప్రజలకు నిత్యావసరాలను ఆదివారం నుంచి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ప్రతీ నెల 1 నుంచి 15 వరకు ఉదయం ఎనిమిది నుంచి 12 వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లాలో 1,123 రేషన్‌షాపుల్లో 6 లక్షల 20 వేల 146 మంది కార్డుదారులకు సరుకులను పంపిణీ చేస్తామన్నారు. 65 ఏళ్ల పైబడి కార్డుదారులకు, దివ్యాంగులకు ప్రతీ నెల 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్డుదారుల ఇంటికే డీలర్లు వచ్చి అందజేస్తారన్నారు. కార్డుదారులు తమ సమీపంలోని ఏ రేషన్ షాపు నుంచైనా నిత్యావసరాలు పొందవచ్చన్నారు.


నరసాపురం స్టేషన్‌లో ప్రయాణికుల క్యూ

రైళ్లకు వేసవి రద్దీ

నరసాపురం, మే 31(ఆంధ్రజ్యోతి):జిల్లా రైళ్లకు వేసవి రద్దీ తాకింది. సెలవులు ముగిస్తుండటం, వివాహాలు తదితర కారణాల వల్ల జిల్లా మీదుగా నడిచే అన్ని రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ఇటు స్టేషన్లలో ఇదే సీన్ కనిపిస్తుంది. రిజర్వేషన్ టిక్కెట్లు లేని ప్రయాణికులంతా జనరల్ బోగీలను ఆశ్రయిస్తున్నారు. నరసాపురం నుంచి నిత్యం 16 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. గుంటూరు, లింగంపల్లి, నాగర్‌సోల్, ధర్మవరం, హుబ్లీ వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ఈ రైళ్లకు జనరల్ బోగీలు సంఖ్య తక్కువ. దీంతో షెడ్యూల్ సమయానికి రెండు, మూడు గంటల ముందుగానే స్టేషన్‌కు వస్తున్నారు. శనివారం ఈ రద్దీ మరింత ఎక్కువ ఉంది. స్టేషన్ మేనేజర్ మధుబాబు, రైల్వే పోలీసులు ధర్మవరం, హుబ్లీ, లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ల్లోని జనరల్ బోగీల్లో ఎక్కే ప్రయాణికులను క్యూలైన్‌లో నిలబెట్టారు. తొక్కిసలాట జరగకుండా రైళ్లు వచ్చిన తర్వాత ఒక్కొక్కరిని ఎక్కించారు.

ఆగస్టు నెలాఖరు వరకు నరసాపురం-అరిసెకెరె ప్రత్యేక రైలు

- నరసాపురం-అలహంక-అరిసెకెరె జంక్షన్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును ఆగస్టు నెలాఖరు వరకు పొడిగించినట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు తెలిపారు. ఈ రైలు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2.20 గంట లకు నరసాపురం నుంచి 07201 నెంబర్‌తో బయలుదేరి మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకు బెంగళూరు సమీపంలోని అలహంక స్టేషన్‌కు, మధ్యాహ్నం 12.45కి అరిసెకెరెకు వెళుతుంది. తిరిగి అక్కడి నుంచి సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు 07202 నెంబర్‌తో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నరసాపురం వస్తుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుంటూరు, వినుకొండ, నంద్యాల, హిందూపూర్ మీదుగా వెళుతుంది.

మళ్లీ అదే తంతు!


కొవ్వాడ కాలువ పటిష్టత పనులు చేస్తున్న సిబ్బంది

అరకొరగా కాలువల పనులు.. నేడు గోదావరి కాలువలకు నీటి విడుదల

ఖరీఫ్ సకాలంలో ముందుకు సాగేలా గోదావరి కాలువలకు నేడు నీరు విడుదల చేయనున్నారు. విజ్జేశ్వరం లాకుల నుంచి ఉదయాన్నే నీటి విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. టీడీపీ అధికారంలో ఎప్పుడు ఉన్నా జూన్ 1నే కాలువలకు నీటిని విడుదల చేయడం ఆనవాయితీ. డిసెంబరు నుంచి మే నెలాఖరు వరకు కాలువల పనులు, మరమ్మతులు, తూడు, గుర్రపుడెక్క తొలగింపులు, నిర్వహణ పనులకు ఈసారీ నిధులు విడుదలలో జాప్యం జరగడంతో అసంపూర్తిగా ముగిశాయి.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- పలుచోట్ల నిలిచిన పనులు
- శివారు ప్రాంతాలకు ఈసారి నీరందేనా..?
- చానాళ్లుగా పడుతున్న కష్టాలు.. మరింత జఠిలం

ఉమ్మడి పశ్చిమలోని గోదావరి కాలువలకు నేడు నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టాలో సుమారు ఆరు లక్షలకు ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తుండగా దీనికి అవసరమైన ఏర్పాట్లు అన్నింటిని జూన్ మొదటి వారంలోనే రైతులు ఆచరిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుగానే కార్యాచరణ రూపొందించి విజ్జేశ్వరం లాకుల నుంచి ఆదివారం ఉదయం లాంఛనంగా నీటిని విడుదల చేయనుంది. అయితే గోదావరి ప్రధాన కాలువలన్నింటిలో చాలాచోట్ల ముందుగా నిర్దేశించిన పనులు పూర్తి కాలేదు. ప్రత్యేకించి డెల్టా ప్రాంతంలో శివారు భూములకు నీరు అందించడమే ఏటా ప్రభుత్వానికి సవాల్‌గా మారుతోంది. డిసెంబరులో జరిగే సాగునీటి సమావేశంలో కాలువలకు నీటిని నిలిపి వేసిన నాటి నుంచి కాలువల నిర్వహణకు చేయాల్సిన పనులు, కావాల్సిన నిధులపై చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తారు. ఏప్రిల్ నాటికి కాలువలు కట్టేసిన తర్వాత నెల రోజుల వ్యవధిలోనే పనులు పూర్తి చేయడానికి లక్ష్యాలను నిర్దేశిస్తారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమలో కాలువల నిర్వహణ జగన్ జమానాలో దారుణంగా మారింది. ఐదేళ్ల కాలువల నిర్వహణ, లాకుల మరమ్మతులను అప్పటి వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. రైతులు డిమాండ్ చేసినా పట్టించుకోలేదు. ఏడాది క్రితం అధికార పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం సాగునీరు, పంట విస్తీర్ణంపై దృష్టి పెట్టింది. ఖరీఫ్‌లో ముందస్తు అంచనా మేరకు కాలువలకు నీరు విడుదల చేయాలనే లక్ష్యాన్ని అమలు చేస్తోంది.

ఆగిపోయిన పనుల సంగతి ఏంటి?

ఉమ్మడి పశ్చిమలో కాలువలు, డ్రెయిన్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల క్రితమే రూ.25 కోట్లు పైగా విడుదల చేసింది. నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపగా ఆమోదించారు. కాలువల్లో ఎక్కడా ఎలాంటి ఆటంకం లేకుండా పనులు పూర్తి చేయాల్సిందిగా గత నెలలో కాంట్రాక్టు ఏజెన్సీలకు నిర్దేశించారు. కాలువలకు నీరు విడుదల చేయక మునుపే పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. కాని నిధులు విడుదలలో జాప్యం జరగడంతో అనేక పనులు నిలిచిపోయాయి. కాలువల్లో మరమ్మతులు పూర్తికాలేదు. ఏటా మాదిరిగానే నెల రోజుల వ్యవధిలోనే హడావిడిగా పనులు మొదలు పెట్టడం, అవి పూర్తి చేయలేక చివరి దశలో చేతులు ఎత్తేయడం రివాజుగా మారింది. ఈసారీ అలాంటి పరిస్థితి నెలకొంది. జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇదే ప్రాంతానికి చెందిన వారు కావడంతో ఆ మేరకు నిర్వహణ శాఖ (మిగతా 8వ పేజీలో)

పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్‌కి గ్రీజింగ్ పనులు

పోలవరం, మే 31(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ గేట్లకు శనివారం ఇరిగేషన్ అధికారులు గ్రీజింగ్ పనులు నిర్వహించారు. కొవ్వాడ కాలువ ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుజాత ఆధ్వర్యంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ 23 గేట్లకు గ్రీజింగ్ పనులు, ఎలక్ట్రికల్ పనులు నిర్వహించారు. మరో వారం పాటు పనులు నిర్వహించనున్నట్టు సిబ్బంది ఇల్లింగి సత్యనారాయణ తెలిపారు. రానున్న వర్షాల సీజనులో గేట్లు సులభంగా ఎత్తి దించడానికి వీలయ్యేలా పనులు నిర్వహిస్తున్నామని, కాలువలో మూడు వందల మీటర్ల మేర ఇప్పటికే పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. గత వరదలకు కాలువ గట్టు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఆరు ప్రాంతాల్లో గట్లు పటిష్ఠపరిచే పనులు జరుగుతున్నాయని వాటిలో మూడు ప్రాంతాల్లో 75 శాతం పనులు మరో మూడు ప్రాంతాల్లో 50 శాతం పనులు పూర్తయ్యాయని, రానున్న వర్షాల సీజను నాటికి పనులు పూర్తయ్యేలా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని డీఈఈ సుజాత తెలిపారు.

ఎర్రకాలువ జలాశయానికి రూ.రెండు కోట్లు విడుదల

- నేడు పనులు ప్రారంభించనున్న ఎమ్మెల్యే



జంగారెడ్డిగూడెం, మే 31(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలోని శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం కష్టాలు తీరనున్నాయి. జలాశయం నిర్వహణకు ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) కోసం రూ.రెండు కోట్లు మంజూరయ్యాయి. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ జలాశయం వద్ద ఆదివారం పనులను ప్రారంభించనున్నారు. జలాశయం నాలుగు ప్రధాన గేట్లకు మరమ్మతులు, కుడి,ఎడమ కాలువల్లో పూడిక తీతలు, గండ్లు పూడ్చడం, పల్లంగా ఉన్న ప్రదేశాలను ఎత్తు చేయడం వంటి పలు అభివృద్ధి పనులకు, కేతవరంలోని దున్నపోతుల చెరువు గండి పూడ్చడానికి ఈ నిధులను ఉపయోగించనున్నారు. 2014 నుంచి 2018 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల అభివృద్ధికి, మరమ్మతులకు ఏటా నిధులు విడుదల చేసేది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను నిలుపుదల చేసింది. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాజెక్టులకు మహర్దశ పట్టిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కి గ్రీజింగ్ పనులు చేస్తున్న సిబ్బంది



వికసిత్ భారత్.. స్వర్ణాంధ్ర లక్ష్యంగా అడుగులు

- 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్

ఏలూరు, మే 31(ఆంధ్రజ్యోతి):వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్య సాధనలో అధికారులకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అడుగులు ముందుకు వేయాలని 20 సూత్రాల ఫార్ములా కమిటీ చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో 20 సూత్రాల అమలుపై జిల్లా అధికారులతో శనివారం సమీక్షించారు. ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు ప్రణాళికా బద్ధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు అమృత్ 2.0 కింద రూ.128.90 కోట్లు కేటాయించారన్నారు. వివిధ అంశాల ప్రగతిని వివరించారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు రమణమూర్తి, త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి పార్థసారథి

92 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు, మే 31(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రానికి 92 శాతం పూర్తి చేశారు. జిల్లాలో 605 సచివాల యాల పరిధిలో 2 లక్షల 58 వేల 804 మంది లబ్ధిదారులు ఉండగా రూ.113 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు సమయానికి 2లక్షల37 వేల 523 మందికి (92 శాతం) పంపిణీ కింద రూ.102 కోట్ల 38 లక్షలను నగదు అందజేశారు. ఇంకా 21వేల281 మంది పంపిణీ చేయాల్సి ఉందని వీరికి జూన్ 2వ తేదీ సాయంత్రంలోగా అందించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు. ఆగిరిపల్లిలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

రేపటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

లోపలి పేజీలో..

ఆక్వా క్రాప్ హాలిడే వాయిదా

పాలకొల్లు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచనల మేరకు ఆక్వా క్రాప్ హాలిడే, చలో అమరావతి కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు పాలకొల్లు జైభారత్ క్షీరా రామ ఆక్వా సంఘం చైర్మెన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు ప్రకటించారు. పాలకొల్లులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో క్రాప్ హాలిడే పాటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జూన్ 9, 10 తేదీల్లో పాలకొల్లు వస్తున్న మంత్రి అచ్చెన్నా యుడు దృష్టికి ఆక్వా సమస్యలు తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామని మంత్రి నిమ్మల చెప్పడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బోనం చినబాబు, రంగయ్యనాయుడు, గుంటూరి చంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదేంటి గోవిందా..!

టీటీడీ కల్యాణ మండపంలో అక్రమంగా బైక్ పార్కింగ్



కైకలూరు, మే 31(ఆంధ్రజ్యోతి) కైకలూరు టీటీడీ కల్యాణ మండప ఆవరణను నిబంధనలకు విరుద్ధంగా బైక్ పార్కింగ్ ప్రదేశంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మార్చివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైల్వేస్టేషన్లో మోటార్‌సైకిల్ పార్కింగ్ షెడ్డు కూలిపోవడం, కాంట్రాక్టర్ టెండరు గడువు ముగిసిపోవడంతో స్టేషన్‌లో బైక్ పార్కింగ్ నిలిపివేశారు. మరో మూడు నెలల వ్యవధిలో కొత్తగా షెడ్డు నిర్మాణం చేసి ఆపై ఆన్‌లైన్ ప్రక్రియలో పార్కింగ్‌కు టెండర్‌ను పిలిచేందుకు రైల్వే అధికారులు యోచిస్తున్నారు. అయితే రైల్వేస్టేషన్‌కు అత్యంత సమీపంలో టీటీడీ కల్యాణ మండపం ఉండడంతో రైల్వేస్టేషన్లో పార్కింగ్ నిర్వాహకులే టీటీడీ కల్యాణ మండప ఆవరణను బైక్‌ల పార్క్ ప్రదేశంగా మార్చి గంటకు రూ.20, 12 గంటలకు రూ.50 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారు. దీనిపై వారిని ప్రశ్నిస్తే టీటీడీ కల్యాణ మండపం అధికారుల అనుమతులతోనే బైక్‌లు పార్కింగ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. టీటీడీ కల్యాణ మండపాల నిర్వాహకుడైన ఓ వ్యక్తి అనుమతి ఇచ్చారని దీనికి కొంత మొత్తంలో నగదు చెల్లిస్తున్నట్టు సమాచారం. పవిత్రమైన టీటీడీ కల్యాణ మండపాన్ని బైక్ పార్కింగ్ ప్రదేశంగా మార్చడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేంకటేశ్వరస్వామి విగ్రహం ఎదుట బైక్‌లు నిలుపుదల చేస్తున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు టీటీడీ కల్యాణ మండపం ముందు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్తా స్వామిని దర్శించుకుంటారు. స్వామివారి విగ్రహం ఎదురుగా బైక్‌లు పార్కింగ్ చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం ఇస్తున్నారని, టీటీడీ ఉన్నతాధికారులు బైక్ పార్కింగ్ నిలిపివేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లకు పాట్లు

- ప్రతి సచివాలయానికి 50 శాతం ప్రజల టార్గెట్
- ఉన్నతాధికారుల ఒత్తిళ్లు.. మిగతా పనులన్నీ పక్కకు ..

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి):యోగాంధ్రలో పాల్గొనేందుకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు పడరాని పాట్లు పడుతున్నారు. గత వారం నుంచి ఉన్నతాధికారుల ఒత్తిళ్లు పెరిగిపోవడంతో అన్ని పనులను పక్కన పడేసి వారి పరిధిలో ఇంటింటికి వెళ్లి అందరిని యాప్‌లో నమోదు చేస్తున్నారు. మీరు యోగా నిత్యం చేస్తారా.. ఎక్కడ యోగాసనాలు నేర్చుకొంటారు.. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఎక్కడ పాల్గొంటారు.. వంటి అనేక ప్రశ్నలు వేసి చివరికి ఫోన్ నెంబరుకు ఓటీపీ పంపించి దానిని నమోదు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. సచివాలయం పరిధిలో మూడు వేల మంది నివసిస్తుంటే 1500 మందిని కనీసం రిజిస్ట్రేషన్ చేయాలన్నా అధికారుల ఆదేశాల మేరకు సెక్రటరీలు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారు.


ఏలూరు రూరల్ మండలంలో యాప్‌లో నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగిని

యోగాపై అవగాహన తక్కువ

అంతర్జాతీయ యోగా దినోత్సవం వచ్చే నెల 21న విశాఖలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి మోదీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో యోగాపై అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయి. యోగాపై అవగాహన పెంచేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. యోగా నిత్యం ఆచరించే వారి సంఖ్య తక్కువగా ఉంది. లక్ష్యం అధిగమించేందుకు ఇళ్లకు వెళ్లి సెక్రటరీలు నానా తంటాలు పడుతున్నాయి. ప్రజల వద్దకు వెళ్లి అసలు విషయం చెప్పకుండా సర్వే అని చెబుతూ వాళ్లంతటికి వాళ్లే యాప్‌లో ఖాళీలు నింపేసి రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం రేషన్‌కార్డు సర్వీసుల కోసం దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తుండగా వాటిని పక్కన పెట్టేశారు. ఎవరైనా సచివాలయానికి వెళితే ముందు యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేయించుకోండని మెలిక పెడుతున్నారు.

మరో ఆరుగురికి కొవిడ్



ఏలూరు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలను కంప్యూటర్‌లో నమోదు చేసే ఓ ఉద్యోగి(26) కొవిడ్ బారినపడ్డారు. కొవిడ్ లక్షణాలతో పరీక్షలు చేయించుకోగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. 95 మంది సిబ్బంది నుంచి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్ పరీక్షలు చేయించగా నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణైందని, శుక్రవారం రాత్రి నివేదిక అందినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆ ఉద్యోగులను హోం ఐసోలేషన్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్టు ఐడీఎస్‌పీ విభాగం వైద్యాధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు. వారి ఇళ్ల వద్ద శానిటేషన్‌తో పాటు, కుటుంబ సభ్యులకు టెస్టులు నిర్వహించామన్నారు. పాజిటివ్ నిర్ధారణైన ఐదుగురిలో ఒకరు మహిళ, మిగతా వారంతా పురుషులే. శనివారం కలెక్టరేట్ అంతా శానిటేషన్ చేయించారు. అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, విజిటర్లు మాస్క్‌లు ధరించడం, చేతులను శానిటైజ్ చేసుకోవడం తప్పనిసరి చేశారు.

మరొకరికి పాజిటివ్..

- వీరిలో ఐదుగురు కలెక్టరేట్ సిబ్బందే
- రేపటి నుంచి అన్ని ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల్లో శ్వాబ్ శాంపిల్స్ సేకరణ
- ఏలూరు జిల్లాకు 20 వేల ఆర్టీపీసీఆర్ కిట్లు పంపించనున్న ప్రభుత్వం

శనివారం ఏలూరు నగరానికి చెందిన 35 ఏళ్ల పురుషుడికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణైందని డాక్టర్ నరేంద్రకృష్ణ వెల్లడించారు. ఏలూరుకు చెందిన మరొకరికి పాజిటివ్ నిర్ధారణైనట్టు సమాచారం. ప్రస్తుతం బాధితులు హోం ఐసోలేషన్‌లోనే ఉన్నారు.

కొవిడ్ కట్టడికి కార్యాచరణ

కొవిడ్ బారినపడిన వారి సంఖ్య జిల్లాలో ఎనిమిదికి చేరింది. కొవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అనుమానితుల నుంచి శ్వాబ్ శాంపిల్స్ సేకరించి టెస్టులను వేగవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. టెస్టులకు అవసరమైన 20 వేల ఆర్టీపీసీఆర్ కిట్లను సోమవారం జిల్లాకు రానుండగా వీటిని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రితోపాటు, జంగారెడ్డిగూడెం, నూజివీడుల్లోని ఏరియా ఆసుపత్రులు, డీసీహెచ్ఎస్ అభ్యర్థన మేరకు అన్ని సీహెచ్‌సీలకు పంపిణీ చేస్తామని డాక్టర్ నరేంద్రకృష్ణ వెల్లడించారు. ప్రస్తుతం నాలుగు వేల కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిలబడిన ప్రయాణికులు



ఏలూరులో రోడ్డుపై బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో ప్రధాన బస్టాండ్ దుస్థితి



కనీస సౌకర్యాలు లేని తాడేపల్లిగూడెం బస్ స్టేషన్



తాడేపల్లిగూడెంలో రోడ్డు పక్కన తణుకు, ఏలూరువైపు ప్రయాణికులు



ఏలూరు పాత బస్టాండ్‌లో బస్సుల కోసం నిలువు కాళ్లపై వేచిచూస్తున్న ప్రయాణికులు

భ..స్టాండ్!

బస్ స్టేషన్, షెల్టర్లలో ప్రయాణికులకు తప్పని తిప్పలు

బస్టాండ్.. ఆటో స్టాండ్.. టాక్సీ స్టాండ్.. రిక్షా స్టాండ్.. ఇవన్నీ ఆయా వాహనాలు నిలిపిఉంచే ప్రాంతాలు. కానీ బస్టాండ్ మాత్రం దీనికి విరుద్ధం. ఇక్కడ బస్సు నిలిపి ఉంచే ప్రదేశంలో బస్సు బదులు ప్రయాణికులు నిలిచి ఉండే ప్రదేశం అని అర్థం చేసుకోవాలి. బస్టాండ్ లేదా షెల్టర్ ఉన్నా లేకున్నా ప్రయాణికులు నిలబడి ఉండాల్సిందే. జిల్లాలో అనేక చోట్ల బస్సు ఎక్కడానికి రోడ్డుపైనా.. దుకాణాల చెంత నిలబడి ఉండాలి. పేరుకు షెల్టర్లు ఉన్నా సౌకర్యాలు ఉండవు. కూర్చునే బెంచ్‌లు ఉండవు.. తాగునీరు దొరకదు.. మరుగుదొడ్లు నిర్వహణ లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి. బస్టాండ్‌లో బిస్కెట్, కూల్ డ్రింక్ ఏదైనా కొనాలంటే దాదాపు రెట్టింపు ధర చెల్లించుకోవాలి.

ఆంధ్రజ్యోతి పరిశీలన

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒకప్పటి రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఆర్టీసీ) ఎలా ఉండేది.. పర్య వేక్షణ.. అలక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉండేవి.. కానీ బస్సులు, బస్టాండ్, షెల్టర్ల నిర్వహణ అధ్వానమే. ఇపుడు పేరు మారినా పాత పోకడ పోలేదు. ఉమ్మడి జిల్లాలో అనేక బస్టాండ్‌లు వర్షం వస్తే నీట మునుగుతాయి. మరికొన్నింటిలో నిర్వహణ లోపాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. బస్టాండ్‌లో ప్రయాణికులు నిలువు కాళ్లపై నిలబడి ఉండాల్సిందే. నిత్య పర్య వేక్షణకు తగినంత సిబ్బంది ఉన్నా కొన్ని సమయాల్లో మాత్రం అంతా గాలికి వదిలి వేస్తున్నారు. రానున్నది వర్షాకాలం. బస్టాండ్ ఆవరణలో డ్రెయినేజీ వ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏలూరు బస్టాండ్ వద్ద నుంచి దాదాపు అన్ని ప్రధాన బస్టాండ్‌లలో సమస్యలు తిష్ట వేశాయి. బస్ షెల్టర్ల పరిస్థితి మరింత అధ్వానం. ఎంపీ కోటాలో నిర్మించిన షెల్టర్లు, దాతల సహకారంతో నిర్మించిన షెల్టర్లన గాలికొదిలేశారు. షెల్టర్లు ఉన్న ప్రాంతంలో బస్సులు నిలపడం మానేశారు. పలు చోట్ల నిరుపయోగంగా ఉంటే మరికొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా ఉన్నాయి. బస్టాండ్‌లు, బస్ సెల్టర్‌లు పై ఆంధ్రజ్యోతి బృందం చేసిన పరిశీలన ఇది.



జంగారెడ్డిగూడెంలో చిరంజీవి యువత నిర్మించిన బస్ షెల్టర్ దుస్థితి

ఏలూరు నగరంలో నిలువ నీడ లేదు

ఏలూరు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైనా ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడలేదు. జిల్లా కేంద్రమైన ఏలూరులో బస్టాండ్‌ల పరిస్థితి అధ్వానం. బస్టాండ్‌లో వ్యాపారులు ఎంఆర్‌పి కంటే రూ.5 నుంచి రూ.20 అదనపు ధరలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. పాత బస్టాండ్‌లో కూర్చోడానికి బెంచీలు, సిమెంటు బల్లలు లేవు. రాత్రి వేళ లైట్లు వెలగడం లేదు. గతంలో డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పాత బస్టాండ్‌ను పరిశీలించి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెల్లవార్లు విద్యుత్ లైట్లు వెలుగుతూ ఉండాలని ఆదేశించినా పట్టించుకునే వారే లేరు. వాష్‌రూమ్‌ల నిర్వహణ అధ్వానం. కొత్త బస్టాండ్‌లో పంపులకు నీళ్లు కూడా రావడం లేదు. తంగెళ్లమూడి, కంద్రికగూడెం సెంటర్, వసంతమహల్, ఫైర్‌స్టేషన్, సత్రంపాడు, వట్లూరు, గూడ్స్‌షెడ్ రోడ్డులోని రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాల్లో నిత్యం ఆర్టీసీ బస్సులు ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటూ ఉంటాయి. ఎక్కడా బస్ షెల్టర్లు లేవు. ప్రయాణికులు బస్సు కోసం రోడ్డుపై దుకాణాల వద్ద వేచి ఉండాల్సిందే. వర్షాకాలం ప్రయాణికులకు మరిన్ని కష్టాలు తప్పవు.

కొత్త బస్టాండ్‌లో విజయవాడ నాన్‌స్టాప్ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులను వ్యాపారులు అడ్డగోలుగా దోచేస్తున్నారు. బస్సులో ప్రయాణికులు షాపుల్లో ఏమి కొన్నా రూ.10 అదనం. అధికారులు కనపడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి బస్‌స్టాండ్‌ను పరిశీలించి హెచ్చరికలు జారీ చేసినా పరిస్థితిలో మార్పు లేదు.

జంగారెడ్డిగూడెం బస్టాండ్‌లో సౌకర్యాలు లేవు

జంగారెడ్డిగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ముఖ ద్వారమైన జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేదు. కొంత కాలం క్రితం దాత మంచినీటి ఫిల్టర్ అందజేసినా వినియోగించక పోవడంతో తిరిగి తీసుకుపోయారు. బస్టాండులో మరుగుదొడ్లను ఉపయోగించాలంటే ప్రయాణికులు రూ.10 చెల్లించాలి. ఉచితంగా ఉపయోగించుకునే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో పలువురు బస్టాండ్ ప్రాంగణంలో మూత్ర విసర్జన చేస్తున్నారు.

బస్టాండ్‌లో వ్యాపారులు తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాసిరకం కూల్ డ్రింక్స్, గడువు ముగిసిన తినుబండారాలు అమ్ముతున్నా పట్టించుకునే వారే లేదు. సైకిల్ స్టాండు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలకు అద్దె వసూలు చేస్తున్నారు.

నిరుపయోగంగా మారిన బస్ షెల్టర్లు

పాత బస్టాండులో చిరంజీవి యువత ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ నిరుపయెగంగా మారింది. లోపలి భాగం కుంగిపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉంటున్నారు. గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో సినీ నిర్మాత డి.రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ నిర్మించిన బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. బస్ షెల్టర్లను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రయాణికులకు ఉపయోగపడని వీరవాసరం బస్ షెల్టర్

వీరవాసరం బస్టాండ్ నిరుపయోగం

భీమవరం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గంలో కీలకమైన వీరవాసరం మండలంలో దాదాపు 25 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ నిర్మించిన బస్టాండ్ ఇప్పటి కీనిరుపయోగంగా ఉంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తారు. పాలకొల్లు, రాజమండ్రి వెళ్లే బస్సులు ఇక్కడ ఆగవు. ప్రయాణికులు వేరే ప్రాంతాల్లో వేచిఉండాల్సి వస్తుంది. కొత్తలో ఆర్టీసి అధికారులు ఇక్కడ కంట్రోలర్‌ను ఏర్పాటు చేసి బస్సులు ఆగేలా చర్యలుతీసుకున్నారు. క్రమేపీ నిర్లక్ష్యం వహించడంతో బస్టాండ్ యాచకులకు ఆవాసంగా, కొంత మంది వ్యాపారలకు గొడౌన్‌గా మారిపోయింది. ప్రైవేట్ వాహనాలు అక్కడ తిష్ట వెయ్యటంతో బస్సులు ఆగే పరిస్థితి లేదు. ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటే ప్రయాణికులకు కూర్చోడానికి కొంత జాగా ఉంటుంది. బస్సులు ఆగడానికి మార్గం ఏర్పడుతుంది.

కైకలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల తిష్ట

కైకలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ఆవరణలో నీరు నిలిచిపోతోంది. కైకలూరు నియోజకవర్గంలో ఒక్కొక్క బస్టాండ్‌లో ఒక్కోరకమైన సమస్య. ముదినేపల్లి బస్టాండ్ వద్ద టాయిలెట్ సక్రమంగా లేవు. సెప్టిక్ ట్యాంక్ పాడయిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కలిదిండి ముఖద్వారం వద్ద పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షానికి జలమయమవతుండడతో చెరువును తలపిస్తుంది. కైకలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో రాత్రి వేళ విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో అంధకారంగా మారుతుంది. బస్టాండ్ ఆవరణలో గోతులతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్‌కు రెండువైపులా పల్లపు ప్రదేశం ఉండడంతో వర్షపునీరు నిల్వ ఉండి దోమలు విజృంభి, పాములు సంచరిస్తున్నాయి. రాత్రి వేళ కొంతమంది బహిర్భూమికి వెళ్లడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ ఫ్లడ్‌లైట్లను తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని, బస్టాండ్ ఆవరణలో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చింతలపూడి ప్రయాణికులకు చింతలే..

చింతలపూడి, మే 31 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గ పరిధిలో చింతలపూడి, కామవరపుకోట మండలాల్లో మాత్రమే బస్టాండ్‌లు ఉన్నాయి. చింతలపూడి బస్టాండ్ ఆవరణ కొద్దిపాటి వర్షం పడినా చెరువులా మారుతుంది. బస్సు వెళ్లే మార్గం వరకే సీసీ రోడ్డు నిర్మించారు. మిగతాదంతా మురుగునీరుతో చేరి ఉంటుంది. బస్టాండ్ నిర్మించి 40 ఏళ్లయినా అభివృద్ధి చేయలేదు. పాత బస్టాండ్‌లో ఎంపీ నిధులతో మినీ బస్టాండ్ నిర్మించారు. కావూరు సాంబశివరావు హయాంలో నిర్మించిన బస్టాండ్ ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఏరియా ఆసుపత్రి, క్రాస్ రోడ్డు, మారుతీ నగర్, లింగపాలెంలో బస్ షెల్టర్లు నిరుపయోగం. చాలా వరకు ఆక్రమణలు, అనాథలకు ఆవాసంగా ఉన్నాయి. ధర్మాజీగూడెంలో గతంలో ఉండే బస్టాండ్ ఇప్పుడు అడ్రస్ లేదు.



ఏలూరు బస్టాండ్‌లో నీటి సౌకర్యం లేని వాష్ రూమ్



కైకలూరు బస్టాండ్ ప్రాంగణంలో రాత్రివేళ అంధకారం



అరొకర సౌకర్యాల తాడేపల్లిగూడెం బస్ స్టేషన్

తాడేపల్లిగూడెంలో రోడ్డుపైనే పడిగాపులు

తాడేపల్లిగూడెం అర్బన్/రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన ప్రాంతాలలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికుడు రోడ్డుపై పడిగాపులు పడుతున్నారు. ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానకు పక్కనే ఉన్న దుకాణాల వద్ద తలదాచుకోవాల్సిందే. ఏలూరు వైపు వెళ్లే ప్రయాణికులకు అసలు షెల్టర్ లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఏలూరు వైపు ప్రయాణికుల రద్దీ ఎక్కువ. భీమవరం వైపు ప్రయాణికులకు కూడా బస్ షెల్టర్ లేదు. తణుకు వైపు బస్‌షెల్టర్ ఉన్నా ప్రయాణికుల అవసరాలకు సరిపోవడం లేదు. ప్రయాణికులు రోడ్డుపై నిలబడి ఉండాల్సిందే.

తాడేపల్లిగూడెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ పందులకు ఆవాసంగా మారింది. చుట్టూ కమర్షియల్ కాంప్లెక్స్‌లు కావడంతో బస్టాండ్ వెనక భాగంలో నీరు నిలిచిపోయి పందులు, దోమలకు నిలయంగా మారింది. రాత్రి వేళ బస్టాండ్‌లో ప్రయాణికులకు దోమల బాధ తప్పడం లేదు.

పెంటపాడు మండలంలో గేటు సెంటర్‌లో తాడేపల్లిగూడెం వైపు బస్ షెల్టర్ ప్రయాణికులకు అనువుగా లేకపోవడంతో ఆకతాయిలకు నెలవుగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

నరసాపురం కొత్త బస్టాండ్ నిర్వహణ భారం

నరసాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ఆధునిక హంగులతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌లలో నరసాపురం ఒకటి. సుమారు రూ.4 కోట్లతో బస్టాండ్ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో బస్టాండ్ ఒక వైపు మాత్రమే ఉండేది, ప్రస్తుతం రెండు వైపులా మెయిన్‌రోడ్‌కు వెళ్లేందుకు మార్గాలు ఉన్నాయి. సువిశాల ప్రాంగణం నిర్వహణ కష్టతరంగా మారింది. వర్షం వస్తే మెయిన్‌రోడ్‌పై నీరంతా బస్టాండ్ ఆవరణలో చేరుతున్నాయి. ప్రయాణికులు వేచి ఉండడమే కాదు పట్టణంలో ఇతర పనులకు వచ్చిన వారు కూడా బస్టాండ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆకివీడు బస్టాండ్‌లో కూర్చోడం కష్టం

ఆకివీడు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో సమస్యలు అధికారులు పట్టించుకోవడంలేదు. కంట్రోలర్ లేకపోవడంతో బస్సులు పాయింటులోకి రాక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. వేచి వున్న ప్రయాణికులకు మంచి నీటి సౌకర్యం లేదు. బస్టాండ్ ప్రాంగణంలో కార్లు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. మరుగుదొడ్ల ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్ ప్రాంగణంలోనికి పశువులు కడిగిన మురుగునీటి వదులుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు.

ఉండిలో వర్షం వస్తే జారి పడాల్సిందే..

ఉండి, మే 31(ఆంధ్రజ్యోతి): ఉండి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ గోతులతో ఇబ్బందికరంగా మారింది. గోతులు పూడ్చినా వర్షం పడితే గ్రావెల్ బురదమయం కావడంతో ప్రయాణికులు జారి పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో మంచినీటి కుళాయి ఉన్నా నీరు రాని పరిస్థితి. అరకొర సౌకర్యాలతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. బస్టాండ్‌లో కూర్చోడానికి బల్లలు ఉన్నా ఫ్యాన్లు లేకపోవడంతో ప్రయాణికులు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



ఉండిలో అసౌకర్యవంతమైన బస్టాండ్



జంగారెడ్డిగూడెంలో తాగు నీరు రాని కుళాయిలు



భక్తులతో రద్దీగా ఉన్న మెట్లదారి, ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

గోవిందా.. గోవింద

ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మే 31(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో చిన్న తిరుపతి హోరెత్తింది. వేలాది మంది భక్తులు శనివారం ద్వారకాతిరుమలకు తరలివచ్చారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో దాదాపు 20 వేలకు పైబడి యాత్రికులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుఝామునుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో సందడిగా మారాయి. శేషాచలం ఘాట్‌రోడ్డు వాహనాలతో కిటకిటలాడాయి. శ్రీవారి ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం 3గంటల నుంచి యాత్రికుల రద్దీ కాస్త తగ్గింది. దర్శనానంతరం భక్తులు శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వెండి చెంబుల బహూకరణ



వెండి చెంబులు అందించిన దాతలు

కృష్ణాజిల్లా పెనమలూరుకు చెందిన ముసునూరు బాల మన్మధరావు శంఖు, చక్ర, నామాలతో ఉన్న పది వెండి చెంబులను స్వామివారి సేవలకు వినియోగించాలని ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. వీటి విలువ షుమారు రూ.1.70 లక్షలు ఉండవచ్చని అంచనా

పొగాకుతో క్యాన్సర్ ముప్పు

ధూమపానం అలవాటుకు దూరంగా ఉండాలి

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

భీమవరం క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని, హెచ్చరికలను చాలా మంది పెడచెవిన పెట్టి ప్రమాదం కొని తెచ్చుకుంటున్నారని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొగాకు అలవాటు విడనాడాలని ప్రతిజ్ఞ చేయించారు. ఏటా మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహిస్తున్నారని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి వివరించారు. వాస్తవానికి ప్రపంచంలో పొగాకును ద్వేషించే వారు చాలా తక్కువగా ఉన్నారన్నారు. అదొక అనవాయితీగా పొగ పీలుస్తూ వారి ఆరోగ్యానికే చేటు కాకుండా పక్కవారికి కూడా అనారోగ్యం దరిచేరేలా వ్యవహరిస్తున్నారన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అనంతరం ఎన్‌సీడీ పీవో డాక్టర్ ధనలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీ కల్యాణి మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించే రోజు మాత్రమే కాకుండా ఏడాది పొడవునా పొగాకు మాన్పించేలా అందరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాలీలో లిపిడో యెమియోలజిస్ట్ సుభాష్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ డాక్టర్ గోవిందబాబు, డాక్టర్ రాంబాబు, అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యశాఖ ఉద్యోగులు



జామాయిల్ తోటలో దుక్కి దున్నిన భూమి

సాగుకు సమాయత్తం

రైతులకు కలిసి వచ్చిన వర్షాలు

కుక్కునూరు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కలిసి వచ్చాయి. ప్రతీ రెండు రోజులకు ఒకసారి వర్షాలు పడడంతో రైతులు సాగుకు సమాయత్తం అయ్యారు. వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఖరీఫ్ సాగు పనుల్లో రైతాంగం తలమునకలయ్యారు. పొలాల్లో విత్తనాలు వేయడానికి సిద్ధం చేస్తున్నారు. భూమి దుక్కి దున్నడంతో పాటు విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో జోరుగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ముందుగానే వర్షాలు కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నా తరువాత సమాయానుకూలంగా వర్షాలు కురుస్తాయో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జామాయిల్ తోటల్లో రైతులు దుక్కులు దున్నుతున్నారు. గత ఏడాది పత్తి, మిర్చి సాగు రైతాంగానికి నష్టాలే మిగిలాయి.. పంట పండించినప్పటికి ఆశించిన ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ ఎన్నో ఆశలతో ఖరీఫ్ సీజన్‌ను ఆరంభించారు.

6న ఆప్కాబ్ చైర్మన్‌గా 'గన్ని' ప్రమాణ స్వీకారం

ఏలూరు/ఉంగుటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులు ఈనెల 6న విజయవాడలో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్‌లుగా ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ మేరకు అధికారికంగా సహకార జీవోలు వెలువరించడంతో విజయవాడలో ఆయన ప్రమాణ స్వీకారానికి ఆప్కాబ్ ఏర్పాట్లు చేసింది.

4న డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు

ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులు ఏలూరులోని డీసీసీబీ కార్యాలయంలో ఈనెల 4న సాయంత్రం పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈమేరకు డీసీబీబీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు ఆహ్వానం అందించారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా మురళీకృష్ణ నియామకం


మురళీకృష్ణకు ఉత్తర్వుల కాపీని అందిస్తున్న డీసీవో శ్రీనివాస్

ఏలూరు మే 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అధ్యక్షుడిగా నరసాపురం లక్ష్మణేశ్వరానికి చెందిన చాగంటి మురళీకృష్ణ (చిన్నా)ను అధికారికంగా నియమిస్తూ సహకారశాఖ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డీసీఎంఎస్‌కు పర్సన్ ఇన్‌ఛార్జిగా ఏలూరు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికలు నిర్వహించే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జనసేన నేత, వ్యాపార వేత్త మురళీకృష్ణ డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): ఏలూరు సీఆర్ఆర్ కళాశాల మైదానంలో జూన్ 2వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-19 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏసీఏ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్ఎస్ఆర్ మూర్తి, ఈ.అశోక్‌కుమార్, ఎస్‌కే షాకీర్ హుస్సేన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2006 సెప్టెంబరు ఒకటి తరువాత జన్మించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. జట్టుకు ఎంపికైన వారు 2025-26లో ఏసీఏ నిర్వహించే సెంట్రల్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 70136 33143 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఏలూరు మెడికల్ కాలేజీ, ప్రభుత్వాసుపత్రిలో
122 పోస్టులకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు గవర్నమెంట్ మెడికల్ కాలేజీలోని పలు రకాల పోస్టుల భర్తీకి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరసా సావిత్రి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల రెండో తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఏలూరులో ఉన్న డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు మెడికల్ కాలేజీలో స్టోర్ కీపర్-3, కంప్యూటర్ ప్రోగ్రామ్‌నర్ -1, ఎలక్ట్రికల్ హెల్పర్ -1, ఆఫీస్ సబార్డినేట్-9, మార్చురీ అటెండెంట్-4, జనరల్ డ్యూటీ అటెండెంట్ 15, ల్యాబ్ అటెండెంట్-2 మొత్తం 35 పోస్టులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో నోటిఫికేషన్ జారీ చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రేడియో గ్రాఫిక్ టెక్నీషియన్ -1, కార్డియాలజీ టెక్నీషియన్ -3, చైల్డ్ సైకాలజీ-1, క్లినికల్ సైకాలజీ-1, కంప్యూటర్ ప్రోగ్రామర్-1, ఎలక్ట్రికల్ హెల్పర్-2, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్-28, జనరల్ డ్యూటీ అటెండెంట్ 22, ల్యాబ్ అటెండెంట్ 3, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ టు-4, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్-1, ఆఫీస్ సబార్డినేట్-14, ఓటీ టెక్నీషియన్-1, సైక్రియాటిక్ సోషల్ వర్కర్-2, స్పీచ్ థెరపిస్టు-1, స్టోర్ అటెండెంట్ 1, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్-1 మొత్తం 87 పోస్టులు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. మెడికల్ కాలేజీ, ప్రభుత్వాసుపత్రిలో కలిపి 122 పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. మరిన్ని వివరాలకు https://westgodavari.ap.gov.inలో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఉమ్మడి పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.


గణపవరంలో పంట కాల్వల వద్ద తొలగించిన వృక్షాలు

చెట్లను తొలగించడం అన్యాయం

» వృక్షప్రేమికుడు, విశ్రాంత టీచర్ అల్లూరి గంగరాజు

గణపవరం, మే31 (ఆంధ్రజ్యోతి): స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని చెట్లను తొలగించడం అన్యాయమని ప్రముఖ వృక్షప్రేమికుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ విద్యాలయాలను ఆనుకుని వున్న క్రీడామైదానం, మురుగు కాల్వల ఆనుకుని ఉన్న సుమారు 150 వృక్షాలను తవ్వకాల పేరుతో నరికివేయ డం తగదన్నారు. 20 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన నాటి నుంచి గణపవరంలోని ఖాళీస్థలాలు, రోడ్ల పక్కన, పుంతగట్లపై, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వందల సంఖ్యలో స్వచ్ఛందంగా మొక్కలునాటి వాటిని పెంచడంతో మహావృక్షాలుగా ఎదిగాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక వృక్షం ఖరీదు రూ.40 లక్షల విలువ చేసే ఆక్సిజన్ అందిస్తుందన్నారు.

రేషన్‌కు బదులు నగదు జమ హర్షణీయం

» సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు : జోగయ్య

పాలకొల్లు, మే 31(ఆంధ్రజ్యోతి) : రేషన్ లబ్ధిదారులు నిత్యావసర సరుకులు వద్దనుకుంటే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం పట్ల మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య హర్షం వ్యక్తం చేశారు. జూన్ ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకులను పాత పద్ధతిలో రేషన్‌షాపుల వద్దనే సరుకులు ఇవ్వడానికి చర్యలు చేపట్టింది. అయితే రేషన్ సరుకులు బదులుగా నగదు అందించాలని రెండు రోజుల క్రితం కూటమి ప్రభుత్వానికి జోగయ్య లేఖ రాశారు. ఆ వెనువెంటనే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తామని సీఎం ప్రకటించడంతో కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులు బియ్యం తదితర సరుకులు వద్దనుకుని నగదుగా తీసుకుంటే వారికి నచ్చిన బియ్యం కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని, ఈవిధంగా చేయడం ద్వారా కోటా బియ్యం అక్రమ అమ్మకాలు తగ్గుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

కొంగ్రొత్తగా ఇంటర్ తరగతులు

» రేపటి నుంచే జూనియర్ కాలేజీలు ప్రారంభం

ఏలూరు జిల్లా డీఐఈవో శేఖర్‌బాబు



ఏలూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల విరామం అనంతరం సోమవారం నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమవు తున్నాయి. ఈ ఏడాది నుంచి నూతన విద్యావిధానాన్ని ఇంటర్ విద్యలో ప్రభుత్వం ప్రవేశ పెడుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేసే విధంగా పలు సంస్కరణలతో విద్యార్థులను ఆకట్టుకునేలా చర్యలు చేపట్టింది. నిర్ణీత టైంటేబుల్‌కు లోబడి పాఠ్యాంశాలను పూర్తి చేసేలా కార్యాచరణను రూపొందించింది. ఇంటర్మీడియెట్ నూతన విద్యాసంవత్సరం(2025-26) జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఏర్పాట్లపై జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారి (డీఐఈవో) టి.శేఖర్‌బాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాలు ఇలా..

- ఏలూరు జిల్లాలో మొత్తం 137 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 19 ప్రభుత్వ, 6 సోషల్ వెల్ఫేర్, 3 ట్రైబల్ వెల్ఫేర్, 26 హైస్కూల్ ప్లస్, 3 కేజీబీవీ, 78 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు.
- సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ తరగతులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించిన 1,919 మంది విద్యార్థులతోపాటు, కొత్తగా ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుంది. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ఎక్కువగా వస్తాయి.
- విద్యార్థిమిత్ర పథకం కింద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది తొలిసారిగా నీట్, ఎంసెట్, తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను ప్రోత్సహించేలా కోచింగ్ మెటీరియల్‌ను ఉచితంగా ఇవ్వనున్నాం. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ రికార్డు బుక్స్‌ను కూడా పంపిణీ చేయనున్నాం. ద్వితీయసంవత్సరం ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు గతంలో ఎన్నడూలేని విధంగా టెక్స్ట్ బుక్స్‌ను ఇస్తున్నాం.
- నూతన సంస్కరణల్లో భాగంగా ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో పరిచయం, అవగాహన ఉండాలనే లక్ష్యంలో భాగంగా ఎంచుకున్న గ్రూపు సబ్జెక్టులతోపాటు, అదనంగా ఇతర గ్రూపులోని ఏదైనా ఒక సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. పర్యావరణవిద్య పరీక్ష మాదిరిగానే ఆప్షనల్ సబ్జెక్టుపై విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో కనీస మార్కులు సరిపోతుంది.
- ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశాం.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు, లైబ్రేరియన్లు, బోధనేతర సిబ్బందికి సాధారణ బదిలీలు సోమ వారంలోగా ముగుస్తాయి. నూతన స్థానాల్లో జూన్ 8వ తేదీలోగా విధుల్లో చేరాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది జనవరి నాటికి సిలబస్‌ను పూర్తిచేసేలా చర్యలు.
- నాడు-నేడు పథకం కింద జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నిర్మాణపనులు, టాయిలెట్లు, ప్రహరీలు, ఆర్వో ప్లాంట్లు కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉండగా, మరికొన్నిచోట్ల అన్నీ పూర్తయి వినియోగంలోకి వచ్చాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. నూతన విద్యావిధానంలో ప్రభుత్వం ఇంటర్ విద్యపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులు జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీసెట్‌లలో పోటీ పడేలా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఆ దిశగా బోధన చేయడానికి అప్పటికే అధ్యాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 15 ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలున్నాయి. అందులో 1,700 మంది రెండో సంవత్సరం విద్యార్థులున్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య

జేఈఈ, నీట్ పరీక్షలపై దృష్టి

» కాలేజీలకు చేరుకున్న పాఠ్య, నోట్ పుస్తకాలు

పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల్లో 84 శాతం ఫలితాలను జిల్లాలో సాధించారు. ఫలితంగా ఈసారి ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు సైతం ఆసక్తి చూపుతున్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం సౌకర్యాలు, వసతులు కల్పించింది. నాడు-నేడులో కళాశాలలను తీర్చిదిద్దింది. ల్యాబ్‌లను బలోపేతం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని గత ఏడాదినుంచే అమలు చేస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు చేరేందుకు దోహదపడుతున్నాయి. మరోవైపు 86 ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో దాదాపు 10వేల మంది విద్యార్థులు ఇంటర్ రెండో సంవత్సరానికి చేరారు. సోమవారం నుంచి తరగుతులు ప్రారంభించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశారు.

'గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తా'


బ్రాహ్మణగూడెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

చాగల్లు, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహాయ సహకారం అందిస్తానని టీడీపీ నేత ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. శనివారం బ్రాహ్మణగూడెంలో రూ. ఐదు లక్షలతో నిర్మించిన శ్రీవినాయక గౌడ సంఘం కమ్యూనిటీ షెడ్డు, రూ.10లక్షలతో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ తెలగ కాపు సేవా సంఘం కమ్యూనిటీ భవ నాన్ని ఆయన ప్రారంభించారు. ఈ రెండింటినీ ఆయన సొంత నిధులతో ఆయన మామ, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు జ్ఞాపకార్థం నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు చిత్రప టానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు గారపాటి విజయదుర్గ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి కృష్ణబాబు సేవలను మరువలేమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ జి.కుమారి, గోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబూరావు, దొమ్మేటి శ్రీను, దొమ్మేటి వేణు, పత్తిపాటి సుబ్బారావు, చిపికల సుధీర్, శ్రీను, చంటి, అల్లూరి రామకృష్ణ, గారపాటి విష్ణుమోహనరావు, గౌడసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

ప్రైవేట్ బస్సు బోల్తా
ప్రమాదంలో ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : బస్సు బోల్తాపడి 22మంది గాయపడిన ఘటనకు సంబంధించి చికిత్స పొందుతూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందారు. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇంటర్‌సిటీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు భీమడోలు-గుండుగొలను మధ్యలోని సూరప్పగూడెం వద్ద ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి బోల్తా కొట్టిన సంఘటన పాఠకులకు విదితమే. ఈ ఘటనలో 22 మందికి గాయాలయ్యాయి. వీరిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా వీరిలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బస్సు కింద చిక్కుకుపోయాడు. బస్సుపడిన సమయంలో అతడి కుడిచేయి బస్సు కింద ఇరుక్కుపోయింది. పోలీసుల, ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును లేపి అతడిని బయటకు తీశారు. మోచేయి దగ్గర నుంచి అరచేయి వరకు నుజ్జునుజ్జు అయ్యి తీవ్రంగా రక్తం పోయింది. అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ శివారు తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు రాజమహేం ద్రవరం ఎస్‌వీజీ మార్కెట్ ప్రాంతానికి చెందిన వేద సాయికుమార్(27)గా గుర్తించారు. అతడు ఇంజనీరింగ్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని గూగుల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 27న సెలవు పెట్టి ఇంటికి వచ్చారు. మళ్లీ విధుల్లో చేరేందుకు శుక్రవారం హైదరాబాద్‌కు వెళుతూ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదపాడు మండలం పునుకొలను గ్రామానికి చెందిన పర్వతనేని నాగప్రదీప్(35) మూడు లారీలు ఉన్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏలూరు సత్రంపాడులోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని కుటుంబంతో నివాసం ఉంటున్నారు. లారీలకు కిరాయిలు సరిగా లేక అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక మానసిక ఒత్తిడి గురై శనివారం సాయంత్రం భార్య, పిల్లలు పనిమీద బయటకు వెళ్లగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు శనివారం రాత్రి అందడంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారును ఢీకొట్టి మోటారు సైక్లిస్టు మృతి

ఏలూరు క్రైం: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మోటారు సైకిలిస్టు ఢీ కొన్న ప్రమాదంలో మోటారు సైక్లిస్టు మృతి చెందాడు. హనుమాన్‌జంక్షన్ నుంచి ఏలూరు వైపు వచ్చే రోడ్డులోని కలపర్రు పాతటోల్‌గేట్ వద్ద ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మోటారుసైక్లిస్టు శనివారం రాత్రి ఢీ కొన్నాడు. వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తిని ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన వాహనం.. యువకుడి మృతి

టి.నరసాపురం, మే31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన టి.నరసాపురం మండలంలో శనివారం జరిగింది. ఎస్ఐ జయబాబు తెలిపిన వివరాలివి.. చింతలపూడి మండలం, బత్తువారిగూడెం గ్రామానికి చెందిన జక్కుల ప్రకాశ్‌బాబు(21) శనివారం కె.జగ్గవరం పంక్షన్‌కు బైక్‌పై వెళ్లాడు. అనంతరం రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వైపు నుంచి వస్తుండగా రాజుపోతేపల్లి వైపు నుంచి వెళ్తున్న టాటాఏస్ వాహనాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నరసింహారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..
భార్య, కుమార్తెపై చాకుతో దాడి

ఇరగవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మద్యం కొనేందుకు డబ్బులు ఇవ్వడం లేదని భార్య, కుమార్తెపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన శనివారం ఇరగవరం మండలం అర్జునుడు పాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అర్జునుడుపాలెంకు చెందిన సాధనాల రాంబాబు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వమని వేధిస్తున్న క్రమంలో అడ్డు చెప్పిన భార్య లక్ష్మీతులసి, కుమార్తె షర్మిలపై చాకుతో దాడి చేసి గాయపరిచాడు. దాడిలో గాయాలపాలైన తల్లీకుమార్తెలను చికిత్స నిమి త్తం స్థానికులు సాయంతో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇరగవరం ఎస్ఐ జానా సతీష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనుగొండ, మే 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వాహనం ఢీకొని గాయాలపాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. మే 24న పెనుగొండ మండలం కొఠాలపర్రు రోడ్డులో ఉన్న కోళ్లఫారం వద్ద ప్యాసెంజర్ ఆటోలో వెళుతున్న ప్రయాణికులను ట్రక్కు ఆటో ఢీ కొట్టడంతో గాయాలపాలైన వారిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సిరిక ధన లక్ష్మి(56) అనే మహిళ మృతి చెందినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కారు

» గొల్లలకోడేరు వద్ద ప్రమాదం.. ఇద్దరికి గాయాలు



పాలకోడేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి మురుగు డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన గొల్లలకోడేరులో శనివారం జరిగింది. గొల్లలకోడేరు వైపు నుంచి బైక్‌పై తల్లీకొడుకులు భీమవరం వైపు వెళ్తుండగా ఎదురు ఆగి ఉన్న కారును తప్పించబోయి రోడ్డుపై పడిపోయారు. ఇదే సమయంలో భీమవరం వైపు నుంచి గొల్లలకోడేరు వైపు వస్తున్న మరో కారు వారిని తప్పించబోయి డ్రైవింగ్ చేస్తున్న యువకుడు బ్రేకు వేయడంతో గొల్లలకోడేరు వద్ద మూడు పల్టీలు కొట్టి డ్రెయిన్‌లోకి దూసుకుపోయింది. కారు నడుపుతున్న యువకుడికి ఎటువంటి గాయాలు కాలేదు. బైక్‌పై వెళ్తూ పడిపోయిన అంతర్వేదిదేవికి, ఆమె కుమారుడికి గాయాలు కావడంతో 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


డీజీపీ హెచ్‌కే గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసిన పోలీసు అధికారుల సంఘ నాయకులు

డీజీపీ గుప్తాను కలిసిన పోలీస్ అధికారుల సంఘ నాయకులు

ఏలూరు క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పూర్తిస్థాయిలో నియమించబడిన ఐపీఎస్ అధికారి హరీష్‌కు మార్‌గుప్తా డీజీపీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శనివారం ఆయనను విజయవాడలో రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శ్రీనివాసరావుతో పాటు ఏలూరు జిల్లా పోలీస్ సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, నాయకులు పలువురు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.


ఎన్టీఆర్ టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించం : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని, గత ప్రభుత్వ విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కూటమి నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. తొలుత ఎన్టీఆర్ టిడ్కో గృహాల కాలనీలో అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు జగన్ పాలనలో నిలిచిపోయాయని, మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. జూన్ నెలాఖరుకు 50 శాతం పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, పలు శాఖల డీఈలు, ఏఈలు, నాయకులు పెచ్చెట్టి బాబు, జీవీ, కర్నేన గౌరు నాయుడు, కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు 24వ వార్డులోని ఏవీఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన టైలర్స్ భవనాన్ని మంత్రి నిమ్మల ప్రారంభించారు. టైలర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం



» 5న ఏపీ ఎడ్‌సెట్-2025
» ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 పరీక్షా కేంద్రాలు
» ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారావు

రాజమహేంద్రవరం, మే31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీఈడీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఏపీ ఎడ్‌సెట్-2025 పరీక్ష ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 కేంద్రాల్లో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల ప్రిన్సిపాల్, ఏపీఎడ్‌సెట్-2025 ప్రాంతీయ సమన్వయకర్త కొండ్రు సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్షకు తనను ప్రాంతీయ సమన్వయకర్తగా ఎడ్‌సెట్ కన్వీనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని శనివారం తెలిపారు. ఎడ్‌సెట్ పరీక్షకు దాదాపు 2500 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నా రు. పరీక్ష ఆరోజు మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం అవుతుందని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా ఉభయ గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి సీనియర్ ప్రొఫెసర్‌లను నియమించామని చెప్పారు. కాగా ఏపీఎడ్‌సెట్‌కు ప్రాంతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన సుబ్బారావును వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అభినందించి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారి.. పాల్గొన్న పారాలీగల్ వలంటీర్లు

ఆర్థికంగా వెనుకబడిన వారికి న్యాయసేవలు అందించాలి

ఏలూరు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు త్వరితగతిన న్యాయసేవలు అందించి, వారికి అండగా నిలవాలని ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం జిల్లాన్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం పారా లీగల్ వలంటీర్లు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఎల్ఏడీసీ, శాశ్వత లోక్‌అదాలత్ సిబ్బందికి నాణ్యమైన సేవలను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు సత్వరమే న్యాయ సేవలను అందించేందుకు సిబ్బందితోపాటు పారా లీగల్ వలంటీర్లు అంకితభావంతో పని చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల రాజీకోసం కృషి చేస్తున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పారా లీగల్ వలంటీర్లు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, ఎల్ఏడీసీ, శాశ్వత లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగానమ్మ జాతర

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి) : శనివారపుపేట శ్రీరామ్‌నగర్ తొమ్మిదో రోడ్డు చివర గవరవరం చెరువు గట్టు వద్దనున్న గంగానమ్మ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్టు లక్ష్మీగణపతి గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ళ మోహనరావు, గుత్తుల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం 108 బిందెలతో అమ్మవారికి అభిషేకం తదుపరి విశేషపూజలు, 2,3వ తేదీల్లో అమ్మవారికి సాముహిక కుంకుమ పూజలు, 4న ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది.

రేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాలు..

పెదవేగి, మే 31(ఆంధ్రజ్యోతి) : కూచింపూడి విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. మరమ్మతుల కారణంగా కూచింపూడి విద్యుత్ కేంద్రం పరిధిలో కూచింపూడితో పాటు న్యాయంపల్లి, గోవిందవారిగూడెం, కొప్పులవారిగూడెం పరిధిలో సోమవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చౌకడిపోల్లోనే రేషన్ సరుకులు

చింతలపూడి, మే 31(ఆంధ్రజ్యోతి):గతంలో రేషన్ పొందిన డిపోల వద్దే సరుకులు తీసుకోవాలని మండల తహసీల్దార్ డి.ఎల్.ప్రమద్వర తెలిపారు. ప్రభుత్వం జూన్ ఒకటి నుండి రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకులను చౌక డిపోల వద్ద నుంచే పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సరుకులు ఇస్తారన్నారు. 65 ఏళ్ళు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వచ్చి డీలర్లు సరుకులను పంపిణీ చేస్తారని తెలిపారు.మండలంలో 51 రేషన్ డిపోలు ఉండగా చింతలపూడి నగర పంచాయతీలో 12 డిపోలు ఉన్నాయని, వాటి వద్దే సరుకులు తీసుకోవాలన్నారు.

ఏఎన్‌ఎం మృతికి ఆరోగ్య కార్యకర్తల నివాళి

ఏలూరు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి):ఇటీవల ఆత్మహత్యకుపాల్పడిన స్థానిక శాంతినగర్-2 సచివాలయ ఏఎన్ఎం కల్యాణి మృతికి సంతాప సూచకంగా మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఏలూరు అర్బన్‌ప్రాంత సచివాలయాల ఆరోగ్య కార్యకర్తలు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. ఏపీ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ నాయకుడు గోవిందరావు మాట్లాడుతూ పనిఒత్తిడి ఉన్నప్పటికీ ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, స్నేహితులతో బాధలు పాలుపంచుకుని ఓదార్పు పొందాలన్నారు. సంఘ నాయకులు శ్రీలక్ష్మి, నాగమణి, వెంకటలక్ష్మి, శ్యామల, సునీత, శశిరత్నం, పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందిపై ఎమ్మెల్యే చంటి ఆగ్రహం

ఏలూరుటూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చంటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నగరంలో ఎక్కడ చూసిన అపారిశుధ్యం తాండవిస్తోందన్నారు. ప్రతి రోజూ పారిశుధ్యంపై ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అసలు పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. తెల్లవారు జామున స్వయంగా తానే పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తానని, ఎక్కడైనా చెత్త కనిపిస్తే తానే శుభ్రం చేస్తానన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ ఏ.భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు,మేస్త్రీలు పాల్గొన్నారు.అనంతరం ఆర్.ఆర్.పేటలోని విజయ చర్మవ్యాధుల ఆసుపత్రి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సుబ్బారావు పేదలకు ఉచితంగా మందులు పంపిణీ ఆ కార్యక్రమంలో పాల్గొని 25 ఏళ్లుగా పేదలకు ఉచిత చర్మవ్యాధుల శిబిరాలు నిర్వహిండాన్ని అభినందించారు. జీవన్ లత, ప్రత్యూష, సరస్వతి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన

దెందులూరు, మే 31(ఆంధ్రజ్యోతి): చల్లచింతలపూడి, కొత్తకమ్మవారిగూడెం, గాలాయగూడెం, గోపన్నపాలెం గ్రామాల్లో నిర్మించనున్న వాటర్ ట్యాంకులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం శంకుస్థాపనలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్(మిల్లుబాబు), పార్టీ కార్యదర్శి నాగన బోయిన సత్యనారాయణ నాయకుల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంక్‌లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నాయకులు పూజారి శ్రీనివాసరావు, చింతా సుబ్బారావు, మారగాని సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు బోడేటి మోహన్‌బాబు, గారపాటి కొండయ్యచౌదరి, వ్యవసాయ కమిటీ డైరెక్టర్లు పూసులూరి ప్రసాద్, మద్దా దయనందరాజు, పార్టీ నాయకులు ఉన్నారు.

రూ. 25 లక్షలతో చిన్న చెరువు ఆధునికీకరణ

చింతలపూడి, మే 31(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో చిన్న చెరువును రూ.25 లక్షల డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం చెరువుకట్టపై చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నగర పంచాయతీలో పబ్లిక్ టాయిలెట్లు, అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాల సేకరణ జరిగిందన్నారు.కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు, కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, ధర్మరాజు, మధుబాబు, కొత్తపూడి శేషగిరిరావు పలువురు పాల్గొన్నారు.

మహానాడుకు అపూర్వ ప్రజాదరణ : ఘంటా

కామవరపుకోట, మే 31(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడుకు రాష్ట్ర నలుమూలల నుంచి అంచనాలకు మించి ప్రజలు తరలివచ్చారని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాయకులు మంచిగా ఏర్పాట్లు చేశారని, ఈ మహానాడుతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. పేదల సమస్యల పరిష్కారం, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందని మురళి తెలిపారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పలువురు ఉద్యోగులకు పదవీ విరమణ సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఏలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రభుత్వం విధించిన లక్ష్యాలకు అనుగుణంగా సేవలందిస్తూ, ఉద్యోగుల హక్కుల కోసం తనదైన శైలిలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మొఖమాటం శ్రీనివాసరావు వన్నెతెచ్చారని పలువురు కొనియాడారు.ఓ హోటల్లో శనివారం రాత్రి శ్రీనివాసరావు పదవీ విరమణ సభ జరిగింది. ఏపీ ఐపీఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా వివిధ క్యాడర్లో శ్రీనివాస్ మంచికి మారుపేరుగా నిలిచారని తెలిపారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో) పి శివాజీ పదవీ విరమణ సభ ఏలూరు కలెక్టరేట్‌లో జరిగింది. ఇదే కార్యాల యంలోని ఏఎస్‌వో ఆది నారాయణకు వీడ్కోలు పలికారు. ఏలూరు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గొట్టిపల్లి కోటేశ్వరరావుకు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. శ్రీనివాసరావు సత్కార సభలో గుంటూరు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు, ఏఎఫ్‌సీలు బూర్ల శ్రీనివాసరావు, నందాజీ, వెంక టరత్నం, ప్రభాకర్‌రావు, ఏలూరు ప్రముఖ వ్యాపారులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఉద్యోగులకు విరమణ సత్కారం


అధికారులను సన్మానించిన ఏఎస్పీ

ఏలూరు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నిర్వహణలో ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొని ప్రజలకు సేవలందించడం ప్రశంసనీయమని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లాలో పోలీస్ శాఖలో పనిచేసి పదవి విరమణ చేసిన అధికారులను ఆత్మీయ సన్మానంతో వీడ్కోలు పలికారు. చింతలపూడి ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు, ఏలూరు సీసీఎస్ ఎస్ఐ వెంకటేశ్వరరావు, కైకలూరు ఎఎస్ఐ జె.మల్లిఖార్జునరావులు శనివారం పదవీ విరమణ చేశారు. వారిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా పూలమాలలు దుశ్శాలువాలతో సత్కరించారు. ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్‌బాషా, ఆర్ఎస్ఐ భాస్కరరావు పలువురు పాల్గొన్నారు.

రామచంద్ర కళాశాల విద్యార్థులకు మొదటి ర్యాంకు

పెదపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థిని జయంతి విశాల సుబ్బలక్ష్మి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చింది. జేఎన్టీయూకే (కాకినాడ)కి సంబంధించి అనుబంధ కాలేజీల్లో ప్రకటించిన ఫలితాల్లో 9.08 సీజీపీఏ సాధించి మొదటి ర్యాంకు సాధించినట్టు కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు అభినందించారు.

మళ్లీ అదే తంతు..

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు ఇటు కాంట్రాక్టు ఏజన్సీలు పనులను సకాలంలో చక్కబెడతారని ఆశించిన అది సాధ్యపడలేదు. అనేక పనులు నామినేటెడ్ పద్ధతిలో కొన్ని చోట్ల రైతులకు అప్పగించారు. వీటిని శరవేగంగా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికి చిన్న చిన్న ఆటంకాలతో సగంలో వదిలి వేశారు. ఆ మేరకు జన వనరుల శాఖ అధికారులు పనులు అమలు చేయలేకపోయారు. ఎమ్మెల్యేల సహకారం మరింత తీసుకుని ఆ మేరకు రాబోయే ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం జరగలేదు.

ఆయుష్మాన్ భారత్‌తో సత్వర వైద్యం

● అందుబాటులో 63 టెస్టులు, 172 రకాలు మందులు ● కలెక్టరేట్ వెనుక వైద్య సేవలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పేదలు సత్వరం మెరుగైన వైద్యం పొందేందుకు ఆయుష్మాన్ భారత్(పట్టణ ఆరోగ్య కేంద్రం) ద్వారా వివిధ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పేదలు నివస్తున్న ప్రాంతాలకు చేరువగా ఆరు సచివాయాల పరిధిలో ఏలూరు కలెక్టరేట్ వెనుక జన్మభూమి పార్కు రోడ్డులో గతేడాది మార్చిలో ఈ కేంద్రం సేవలు ప్రారంభమయ్యాయి. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ఆర్‌హెచ్ఎం) నిధుల కింద రూ.88 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. ఇక్కడ రోజూవారీ వివిధ ఆరోగ్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. వందల్లో ఖర్చయ్యే ఆరోగ్య పరీక్షలు ఉచితంగానే ఇక్కడ చేస్తారు. గంటల వ్యవధిలో రిపోర్టులను అందిస్తున్నారు. హిమోగ్లోబిన్, రక్తపరీక్షలు, ఇతర పరీక్షలకు పేదలు వెచ్చించలేని వారు ఇక్కడ సేవలతో సంతృప్తి చెందుతున్నారు. దీనికి ఒక ల్యాబ్ టెక్నీషియన్ కూడా అందుబాటులో ఉన్నారు. ప్రధానంగా లివర్, కిడ్నీ, మలేరియా, డెంగీ, టీబీ, హిమోగ్లోబిన్(సీబీటీ) తదితర 63 పరీక్షలను చేస్తారు. అదే విధంగా 172 రకాల మందులు సైతం అందుబాటులో ఉన్నాయి.

ఉపయోగించుకుంటే ఎంతో మేలు...

ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు, స్టాఫ్‌నర్సు, ఇతర సిబ్బంది అవుట్ పేషంట్ల, ఇతర రోగుల బాగోగులు చూస్తారు. రోజు మామూలు రోజుల్లో 40 మంది ఓపీ చూపించుకుంటున్నారు. దాదాపు 100 మందికి రోజు సేవలందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతీ నెలా 9, 10వ తేదీల్లో ప్రత్యేకంగా గర్భిణులు వివిధ రకాలు పరీక్షలను చేసి, అవసరమైన మందులను ఇస్తున్నారు. ప్రధానంగా తల్లి, బిడ్డ సంక్షేమం కోసం పలు సూచనలు, సలహాలు, పరీక్షలను సత్వరమే చేస్తున్నారు. హెచ్ఐవీ, హైపటైటిస్-బి పరీక్షలతో పాటు అత్యవసరం వైద్యం కూడా చేస్తున్నారు. అయితే ఈ ఆసుపత్రిలో 10 పడకలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇక్కడ సామగ్రి అందలేదని సమాచారం. సూపర్‌వైజర్ పోస్టు భర్తీ కావాల్సి ఉంది. ఒక పర్మినెంట్ బెడ్‌పైనే రోగుల పరీక్షలు చేయడం, అత్యవసర సేవలను చేసున్నారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని సేవలను సత్వరం అందిస్తున్నామని, ఎక్కడా మందుల కొరత లేదని వివరించారు. ప్రధానంగా సుగర్, హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న పేషంట్లు రోజూ ఎక్కువగా వస్తుంటారని ఆమె తెలిపారు.


ఏలూరులో ఉన్న ఆయుష్మాన్ ఆస్పత్రి


34వ డివిజన్లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి


భీమడోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న గన్ని


యర్రంపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ముందస్తుగా ఉత్సాహంతో పింఛన్ల పంపిణీ

భీమడోలు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆప్కాబ్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. భీమడోలులోని పలు ప్రాంతాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేస్తున్న ఘనత ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.

34వ డివిజన్లో ఎమ్మెల్యే చంటి పంపిణీ

ఏలూరు టూటౌన్ :ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు 34వ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే చంటి శనివారం ప్రారంభించారు. జూన్ 1వ తేదీ ఆదివారం వచ్చినందున ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. త్వరలోనే తల్లికివందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వాలన్నారు. ఏఎంసీ ఛైర్మన్ ఎం.పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలంలో 87 శాతం పంపిణీ

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో ఒక రోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేశారు. శనివారం మధ్యాహ్నానికి 87శాతం పింఛన్లను పంపిణీ జరిగిందని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు.

యర్రంపల్లిలో ఎమ్మెల్యే రోషన్..

చింతలపూడి :యర్రంపల్లిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆదేవిధంగా శుక్రవారం రాత్రి చింతంపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

5వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

ఏలూరుటూటౌన్ :టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో 5వ డివిజన్ ఇన్‌చార్జి దాసరి కామేశ్వరి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. వయోవృద్ధులు, అంగవైకల్యం, డయాలసిస్ పేషెంట్లకు, వితంతువులకు కూటమి ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఎం.కృష్ణ, పి.రాంబాబు, కె.విటల్, పి.దాలిరాజు, ప్రసాద్, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పెదవేగి, మే 31(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా 66మందికి రూ.50.44లక్షల విలువైన చెక్కులను అందించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది పేదలు సరైన వైద్యం అందక అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే సహాయ నిధి ద్వారా వైద్యానికి అవసరమైన సొమ్మును అందిస్తున్నట్టు తెలిపారు. దెందులూరు ఏఎంసీ ఛైర్‌పర్సన్ గారపాటి రామసీత, పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్ ప్రసాద్, తాతా సత్యనారాయణ, ఈడ్పుగంటి అనిల్, గుత్తా అనిల్, పెనుబోయిన మహేష్, మాగంటి నారాయణ ప్రసాద్, నేతల రవి, ఎన్.నాగరాజు, ఎం.రవి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న చింతమనేని

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని ఏపీ పంచాయతీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి పి.కిశోర్, కోశాధికారి పుప్పాల కన్నబాబులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారని గుర్తు చేశారు. కార్మికులకు యూనిఫారాలు, సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె, గ్లౌజ్‌లు అందచేయాలని కోరారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ మాధవ్

పొగాకు క్యూరింగ్‌పై అవగాహన

జీలుగుమిల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు క్యూరింగ్‌కు రైతులు కలపకు బదులుగా గ్యాస్ వినియోగించాలని సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. జీలుగుమిల్లి సీటీఆర్ఐ వద్ద రైతులకు నాణ్యమైన పొగాకు దిగుబడుల సాధనపై అవగాహన కల్పించారు. గత 30 ఏళ్లుగా రైతులు క్యూరింగ్ దశలో కలప వాడుతున్నారని, దీంతో పొగాకు నాణ్యత దెబ్బ తింటుందన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు సూచనలు చేశారు. ఐటీసీఎల్ జనరల్ మేనేజర్ వర్నేకర్, చీఫ్ మేనేజర్ లలిత, పొగాకు విస్తరణ అధికారి సురేఖ, ఆర్ఎం.ప్రసాద్, ప్రాజెక్ట్ హెడ్ ఎల్‌కె.ప్రసాద్, హెడ్ సుబ్బయ్య అసిస్టెంట్ ఫామ్ మేనేజర్ టి.రమేష్, సిబ్బంది వెంకటేశ్, దేవానంద్ ఉన్నారు.


శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మహిళల భద్రతకు శక్తి యాప్

ఏలూరు క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో మహిళలు, విద్యార్థినుల భద్రత అత్యంత ముఖ్యమని ఇందుకోసం పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నారని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు శక్తియాప్‌పై నగరంలోని సిద్ధార్థ కాలేజీలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ శక్తియాప్ ద్వారా తక్షణమే పోలీస్ సహాయాన్ని పొందగలుగుతారన్నారు. శక్తియాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే పరోక్షంగా తమతో పోలీసులు ఉన్నట్టేనని, నిమిషాల వ్యవధిలోనే పోలీస్ సాయం అందుతుందన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో పలువురిపై కేసులు

చింతలపూడి, మే 31(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి తలార్లపల్లికి చెందిన డి.శివపార్వతికి చెందిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. పంతంగులగూడెం గ్రామానికి చెందిన డి.ఇందిర అనే మహిళపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ అశోక్ తెలిపారు. వెలగపాడులో పరారీలో ఉన్న నిందితుడు గట్టు చక్రిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. నాగిరెడ్డిగూడెంలోని అవుట్‌పోస్టును ఆకస్మిక తనిఖీ జరిపి ఆ గ్రామంలో సారా నిర్మూలన కోసం గస్తీ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈదాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు సీఐ ఫణికుమార్, ఎస్ఐలు నరసింహారావు, ఖలీల్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : మానవత

భీమడోలు, మే 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ప్రతిభను చాటి అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారం ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. క్విజ్, వ్యాస రచన, కబడ్డీ, చిత్రలేఖనం, టాలెంట్ గేమ్‌లో విజేతలుగా నిలిచిన వారిని వారు అభినందించారు.

● లింగపాలెం : ధర్మాజీగూడెం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు ఖోఖో, స్కిప్పింగ్ ఆటలు నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని అన్నారు.

ఏఈవో లక్ష్మణస్వామి ఉద్యోగ విరమణ



ద్వారకాతిరుమల, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధిలో సేవలందిస్తూ ఉద్యోగ విరమణ చేయడం పూర్వపుణ్యఫలమని దేవస్థానం ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి అన్నా రు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఏఈవోగా పనిచేసి శని వారం ఉద్యోగ విరమణ చేసిన రావిపాటి లక్ష్మణస్వామిని ఆల య కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. స్వామి, అమ్మ వార్ల దర్శనం అనంతరం కార్యాలయంలో ఈవో ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందచేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, నటరాజారావు, డీఈ టి.సూర్యనారాయణ ఉన్నారు.

మద్ది ఆంజనేయుడికి పంచామృతాభిషేకం



జంగారెడ్డిగూడెం,మే 31 (ఆంధ్రజ్యోతి) : మద్ది ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఈఓ ఆర్‌వి.చందన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ఆలయార్చకులు పంచామృత అభిషేకం చేశారు.


నాట్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు

కూచిపూడి నృత్యం నేర్చుకున్న చిన్నారులు

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): దత్తాశ్రమంలో శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం పదవ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.సాహితీవేత్త డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కూచిపూడి నాట్యాన్ని అందించాలన్నారు. నాట్య మయూరి మేదరమెట్ల శిరీష మాట్లాడుతూ నాట్య దినోత్సవాన్ని కూచిపూడి నాట్య పితామహుడు సిద్ధేంద్రయోగి జయంతి నాడు అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. వేసవి శిక్షణ శిబిరంలో కూచిపూడి నేర్చుకున్న 80 మంది విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలను బహూకరించారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని కొత్త బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న ఆయన విగ్రహానికి అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ దిరిసాల వరప్రసాద్, ఎండీ ఖాజావలి, నాని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో గుత్తా కాశీ, కె.సూర్యారావు, సిరాజుద్దీన్, క్రియేటివ్ శంకర్, ఉమామహేశ్వరరావు, ఆదిబాబు, దుర్గారావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ప్రముఖ సాహితీవేత్త లంక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కృష్ణ జయంతిని నిర్వహించగా సంగీత విభావరి ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. సంగీతం శ్రోతలను మైమరిపించింది. అభిమాన సంఘం నాయకులు ప్రసాద్ పర్యవేక్షించారు.


నివాళులర్పిస్తున్న అభిమానులు

యోగాతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): యోగా మానసిక ఒత్తిడి నియంత్రిస్తుందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పేర్కొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో యోగాంధ్ర వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు శనివారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. జూన్ 21 వరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నిత్యం విధుల్లో ఒత్తిడికిలోనయ్యే పోలీస్ సిబ్బందికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భాగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని ప్రపంచ వ్యాప్తంగా యోగాను గుర్తించి ఆచరిస్తున్నారన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు భాస్కరరావు, నరేంద్ర, సత్యనారాయణలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ

లింగపాలెం, మే 31(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న అన్నారు. ధర్మాజీగూడెంలో వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్సు, సంబంధిత పత్రాలు వెంట లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు రేషన్ దుకాణాల ప్రారంభం

జంగారెడ్డిగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 25 వార్డులోని 37 వ రేషన్ దుకాణం వద్ద రేషన్ సరుకుల పంపిణీని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదివారం ప్రారంభించనున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, కొండ్రెడ్డి కిషోర్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదిహేను రోజుల్లో ప్రజలు తమకు వీలుపడిన సమయంలో ఎప్పుడైనా రేషన్ దుకాణం వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవచ్చన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, తెలగారపు జ్యోతి, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, పాతూరి అంబేద్కర్, మహంకాళి రామ్మోహనరావు పాల్గొన్నారు.

6న మండల పరిషత్ సమావేశం

బుట్టాయగూడెం, మే 31(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 6వ తేదీన ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు జరుతుందని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు. మండల పరిధిలోని శాఖల పనితీరు, అభివృద్ధిపై సమీక్ష ఉంటుందని అన్నిశాఖల అధికారులు నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని, లేదంటే కలెక్టరుకు నివేదిక పంపుతామన్నారు.

ఇంటర్ సిబ్బందికి యోగాసనాలు

ఏలూరు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసవేడుకల్లో భాగంగా శనివారం వట్లూరు టీటీడీసీ హాల్లో ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కార్యాలయ సిబ్బంది, ప్రైవేటు అధ్యాపకులు, ఆయుష్ వైద్యాధికారులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు యోగా ధ్యానంలో పాల్గొన్నారు. యోగాసనాల ఆవశ్యకతను ఆర్‌ఐవో యోహాన్ వివరించారు.

మల్టీపుల్ స్క్లెరోసిస్‌పై అవగాహన

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): నాడీ వ్యవస్థ, మెదడు, వెన్నుముకపై ప్రభావం చూపే మల్టీపుల్ స్క్లెరోసిస్ వ్యాధిపై మాదేపల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో కె.ఉమామహేశ్వరరావు అవగాహన కల్పించారు. స్క్లెరోసిస్ దినోత్సవ సందర్భంగా ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అవగాహన కల్పించామన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరపీ లాంగ్వేజ్ థెరపీ, కృత్రిమ అవయవాలు అందిస్తామన్నారు.

17వ రోజుకు రిలే దీక్షలు

బుట్టాయగూడెం, మే 31(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల పట్ల ప్రభుత్వానికి చిన్నచూపు తగదని ఏటీఏ జిల్లా ఉపాధ్యక్షుడు తెల్లం గంగరాజు అన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు గత 17 రోజులుగా పశ్చిమ ఏజెన్సీలోని ఆదివాసీలు, ఆదివాసీ, ప్రజా సంఘాలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా నేటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శనివారం 17వ రోజు దీక్షలను ప్రారంభించి దీక్షల్లో పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలని, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని ఆదివాసీలు రిలే దీక్షలు చేపట్టారు. దీక్షల్లో కె.కన్నయ్య, టి.లేఖన, డి.మోహనరావు, పోతురాజు, కుంజా వెంకటేశ్వరావు, పొట్ట వెంకటేశ్వరరావు, కుంజా కృష్ణంరాజు, టి.లక్ష్మణరావు, పి.రమేశ్‌కుమార్‌రెడ్డి, డి.నాగరాజు పాల్గొన్నారు.

ఐటీడీఏలో బదిలీ కౌన్సెలింగ్

బుట్టాయగూడెం, మే 31(ఆంధ్రజ్యోతి) : కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతిగృహ సంరక్షకులు, నాల్గవ తరగతి సిబ్బంది, బోధనేతర సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్ పూర్తి చేసినట్టు పీవో కె.రాములు నాయక్ తెలిపారు. బదిలీల కోసం 178 మంది ఉద్యోగులు దరఖాస్తు చేయగా 83 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు పూర్తిచేసినట్లు తెలిపారు.

అందుబాటులో విత్తనాలు

ఏలూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ఏరువాక కేంద్రంలో బీపీటీ 5204 సోనా మసూరికి ప్రత్యామ్నాయంగా విడుదలైన ఎంటీయూ 1224, 1262 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.ఫణికుమార్ తెలిపారు.మరింత సమాచారం కోసం(99896 23804) నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

గోకుల తిరుమలేశునికి సుప్రభాత సేవ

జంగారెడ్డిగూడెం, మే 31(ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేకువ జామునుండి స్వామి వారికి సుప్రభాత సేవ తీర్థ ప్రసాద గోష్టి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌పేపర్లు చదవడం అలవర్చుకోవాలి

కలిదిండి, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు న్యూస్ పేపర్లను ప్రతీ రోజు చదవడం అలవర్చుకోవాలని కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు జె.రమేష్‌బాబు, రాఘవులు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో విద్యార్థులచే వార్త దినపత్రికలను చదివించారు. గ్రంథాలయాల్లో న్యూస్ పేపర్లు ప్రతీ రోజు అందుబాటులో ఉంటాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కైకలూరులో యోగా సాధన చేస్తున్న పోలీసులు

యోగా ఆరోగ్యానికి దివ్య ఔషధం

కైకలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్ అన్నారు. యోగాంధ్ర వేడుకల్లో భాగంగా కైకలూరు పోలీసుస్టేషన్ల సముదాయం వెనుక శనివారం సామూహిక యోగాసనాల సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐలు మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం కాదని మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నియంత్రణకు దోహదపడుతుందన్నారు. నిత్యం ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి యోగా ఎంతో అవసరమన్నారు. ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 21వ తేదీ వరకు పోలీసులు యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ఎస్‌ఐలు డి.వెంకటకుమార్, ఆర్.శ్రీను, వెంకటేశ్వరరావు, వి.రాంబాబు, రామచంద్రరావు, వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకు వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

పొగాకు వినియోగంతో అనారోగ్యం : ఎమ్మెల్సీ

కైకలూరు, మే31(ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగం వల్ల అనారోగ్యానికి గురవుతారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సూచించారు. శనివారం కైకలూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'నేను పొగాకుకు వ్యతిరేకిని అని సంతకాల సేకరణ, పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తడమే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో పొగ పీల్చడం వల్ల సమీపాన ఉన్నవారికి ఇబ్బందులు కలుగుతాయన్నారు. నవజీవన్ బాలభవన్ సంస్థ సభ్యురాలు ఎం.లీలావతి, టౌన్ ఎస్‌ఐ డి.వెంకటకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అహల్యాబాయి జీవిత చరిత్ర సంపుటిని ఆవిష్కరిస్తున్న కృష్ణారావు, నేతలు

అహల్యాబాయి జీవిత చరిత్ర సంపుటి ఆవిష్కరణ

ముదినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా శనివారం ముదినేపల్లిలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆమె జీవిత చరిత్రకు సంబంధించి సంపుటిని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు మాట్లాడుతూ అహల్యాబాయి దేశంలో మహిళా సాధికారత, సామాజిక సంస్కరణలకు, రైతు అనుకూల విధానాలకు, సుపరిపాలనకు నాంది పలికిన సంస్కర్తగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. బీజేపీ నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, కొల్లిపర నాగరాజు, బండారు పాండురంగారావు, పసుపులేటి నరసింహారావు, అడుసుమిల్లి సాయికృష్ణ, రెడ్డినాగలక్ష్మి, మేలిమి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీల ఆదాయం రూ.2,34,984

కైకలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆలయాల్లో భక్తులు సమర్పించిన కానుకల హుండీల సొమ్ము ఆదాయం రూ. 2,34,984 వచ్చిందని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీల సొమ్ము 73 రోజులకు శనివారం లెక్కించగా రూ.1,60,927, ఆలయంలో వున్న శ్రీరామలింగేశ్వర శ్రీరామేశ్వరస్వామి వార్లకు రూ.12,087, వేంకటేశ్వరస్వామికి 73 రోజుల్లో రూ.61,970 ఆదాయం వచ్చిందని తెలిపారు. హుండీల లెక్కింపు గుడివాడ ఎండోమెంట్ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించామన్నారు.

కడప మహానాడు విజయవంతం : మంత్రి సారథి

ఆగిరిపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): కడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు ఘనంగా జరిగిందని మంత్రి పార్థసారథి తెలిపారు. కార్యకర్తల ఆదరణ, అభిమానంతో తెలుగుదేశం పార్టీ అత్యంత పటిష్టంగా ఉందన్నారు. ఆగిరిపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కడపలో మూడు రోజులు జరిగిన మహానాడులో టీడీపీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ప్రజలతో పాటు కార్యకర్తల భవితవ్యాన్ని మార్చేందుకు కొత్త ప్రణాళికలు ప్రకటించారని తెలిపారు. నూజివీడు నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు తరలి వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మండలంలో భూ సమస్యల పరిష్కారానికి ఆర్డీవోలతో ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేస్తానని తెలిపారు. వీటికోసం జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలతో ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆగిరిపల్లి మండలంలో డ్రెయినేజీ, రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.



ఏపీపీని సత్కరించిన రాష్ట్ర కొప్పు వెలమ కార్పొరేషన్ చైర్మన్

ఏపీపీని సత్కరించిన కొప్పు వెలమ కార్పొరేషన్ చైర్మన్

నూజివీడు, మే 31 (ఆంధ్రజ్యోతి): 15వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన నూజివీడులోని న్యాయవాది వాకా రాజకుమారిని కొప్పు వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వెంకట గణేశ్ కుమార్ శనివారం సత్కరించారు. నూజివీడు వచ్చిన చైర్మన్ ఏపీపీ రాజకుమార్ నివాసానికి వెళ్లి అభినందించారు. గణేశ్ కుమార్ మాట్లాడుతూ మంత్రి కొలుసు పార్థసారథితో సంప్రదించి త్వరలో నూజివీడు నియోజకవర్గ కొప్పు వెలమ సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. పలువురు బీసీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఆయనను కలిశారు.

పెండ్లి కుమారుడుకి బంగారు నాణెం

చాట్రాయి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యుడు గూంట్రు వెంకటేశ్వరరావుకు కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకంలో రూ 20 వేల విలువైన బంగారు నాణేన్ని శనివారం అందజేశారు. వెంకటేశ్వరావు కుమారుడు తేజ వివాహం సందర్భంగా సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి నాణెం అందజేశారు.



బంగారు నాణెం అందజేస్తున్న డైరెక్టర్

మళ్లీ అదే తంతు..

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు ఇటు కాంట్రాక్టు ఏజెన్సీలు పనులను సకాలంలో చక్కబెడతారని ఆశించిన అది సాధ్యపడలేదు. అనేక పనులు నామినేటెడ్ పద్ధతిలో కొన్ని చోట్ల రైతులకు అప్పగించారు. వీటిని శరవేగంగా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికి చిన్న చిన్న ఆటంకాలతో సగంలో వదిలివేశారు. ఆ మేరకు జన వనరుల శాఖ అధికారులు పనులు అమలు చేయలేకపోయారు. ఎమ్మెల్యేల సహకారం మరింత తీసుకుని ఆ మేరకు రాబోయే ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం జరగలేదు.

ఏడు వారాలుగా ఉపాధి వేతనాలు బంద్

సొమ్ములేక శ్రామికుల ఇక్కట్లు

ముదినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి శ్రామికుల వేతనాల చెల్లింపు నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాకపోవడంతో వేతనాల చెల్లింపులో జాప్యం ఏర్పడింది. ముదినేపల్లి మండలంలో ఉపాధి పనుల శ్రామికులకు ఏడు వారాలుగా వేతనాలు అందడం లేదు. మండలంలో సుమారు పది వేల జాబ్ కార్డుల హోల్డర్లకు వేతనాలు అందాల్సి ఉంది. ఉపాధి శ్రామికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇతర కూలి పనులు వ్యవసాయ పనులు ఏమీ లేకపోవటంతో గ్రామీణ ప్రాంతాల్లోని శ్రామికులు కేవలం ఉపాధి పనులపైనే నాలుగు నెలులగా ఆధారపడి జీవిస్తున్నారు. అంతేకాక ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభమయ్యే వరకు మరో రెండు నెలలపాటు కూలీలకు ఉపాధి పనులే దిక్కు. ఇప్పటివరకు చేసిన పని దినాలకు ఏడు వారాల నుంచి వేతనాలు అందకపోవడంతో ఉపాధి శ్రామికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో హేమంత్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఏడువారాలుగా వేతనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం బడ్జెట్‌ను విడుదల చేయాల్సి ఉంది.

వేతనాలు లేక ఇబ్బందిగా ఉంది



ఉపాధి పనులు చేసిన పనిదినాలకు ఏడు వారాల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. ఉపాధి కూలీలు అప్పులు తెచ్చుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి.

– నున్న నాగరాజు, పేరూరు



ముదినేపల్లి మండలంలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు





కైకలూరులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు.. వడాలిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నరసింహారావు

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

కైకలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం ఒకరోజు ముందుగానే అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరు 111వ బూత్‌లో సామాజిక పెన్షన్ల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పెన్షన్లను రూ.3వేలు నుంచి రూ.4వేలకు పెంచడమే గాక జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లను ఇంటింటికి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పడమట వాసు, మాజీ అధ్యక్షుడు ఎండీ జాని, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, టీడీపీ నాయకులు ఆచంట వినయ్, వీరాబత్తిన సుధ, లక్కింశెట్టి మోహన్, బంకపల్లి భాస్కరరావు, రసూల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శనివారం కోలాహలంగా జరిగింది. మండలంలో తొలిరోజు 92 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. మధ్యాహ్నం రెండు గంటల సమయానికే మండలంలో 82 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. మండలంలో తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, స్థానిక నాయకులు పెన్షన్లు పంపిణీ చేశారు.

చాట్రాయి : ప్రతి నెల పింఛన్ అందిస్తూ సీఎం చంద్రబాబు ప్రతి ఇంటికి పెద్ద కొడుకు అవుతానన్న హామీని నిలబెట్టుకున్నారని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండలో శనివారం టీడీపీ నాయకులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం పెన్షన్లు 8,256 ఉండగా శనివారం సాయంత్రానికి 90 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. నక్కా రాము, పరసా శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, సతీశ్, వీరాస్వామి, చందు, వెల్ఫేర్ అసిస్టెంట్ చారి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పింఛన్లు పంపిణీ చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆగిరిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి శనివారం పరిశీలించి పలువురికి పింఛన్లు అందజేశారు. మండలంలో 9,425 మందికి గాను రూ.41,29,950 అందిస్తున్నట్టు తెలిపారు. త్వరలో అన్నదాన సుఖీభవ, తల్లికి వందనం పథకం అమలు చేస్తామన్నారు.



చనుబండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నేటి నుంచి దుకాణాల వద్దే రేషన్ పంపిణీ



విలేఖరులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కైకలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల్లోనే నిత్యావసర సరుకులు పంపిణీ ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తెలిపారు. శనివారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డీలర్ల కాటాలను, మండలంలోని నరసాయిపాలెం, తదితర గ్రామాల్లో రేషన్ దుకాణాలను ఆయన పరిశీలించారు. కాటాలు లాకులను అధికారుల సమక్షంలో వేశారు. జిల్లాలో కరోనా కేసులు ఉన్నందున రేషన్ షాపుల వద్ద కరోనాకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సామాజిక దూరాన్ని పాటించి శానిటైజేషన్, మాస్కులు వినియోగించాలన్నారు. రేషన్ దుకాణాల వద్ద ప్రజలు గుంపులుగా ఉండకుండా ఒక్కొక్కరే వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాలన్నారు.

● ముదినేపల్లి : రేషన్ పంపిణీకి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు సిద్ధమయ్యాయి. ఆదివారం నుంచి ఈ దుకాణాల ద్వారానే ప్రజలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నారు. ముదినేపల్లి మండలంలోని 39 చౌకధరల దుకాణాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. తూనికల మిషన్లు, ఈ-పాస్ యంత్రాలు, ఇతర మెటీరియల్‌ను అధికారులు పరిశీలించారు. ఈ-పాస్ యంత్రాల్లో యాప్‌ను అప్‌లోడ్ చేసే పనులు నిర్వహించారు. తహసీల్దార్ పవన్‌కుమార్, ఏలూరు తూనికల కొలతల శాఖ అధికారి జి.రమేష్, సివిల్ సప్లయిస్ డీటీ ఎమిలీకుమారి మిషన్లను తనిఖీ చేశారు. మండలంలోని అన్ని చౌక డిపోలకు బియ్యం నిల్వలు కూడా దిగుమతి చేసినట్టు సివిల్ సప్లయిస్ డీటీ తెలిపారు.

● ఆగిరిపల్లి : మండలంలోని ప్రతీ గ్రామంలో ఆదివారం నుంచి రేషన్ దుకాణాలలో సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పీఎన్ వీఎప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం లో 35 రేషన్ దుకాణాల డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డులకు రేషన్ షాపుల వద్ద మంచినీరుతోపాటు ఇతర సౌకర్యాలు సమకూర్చాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ డీలర్లు వెళ్లి సరుకులు అందించాలన్నారు.

● చాట్రాయి : చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఈశ్వరరావు చెప్పారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో రేషన్ షాపులలో ఆదివారం నుంచి రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. వృద్ధుల ఇంటి వద్దకే డీలర్ తీసువెళ్ళి సరుకులు అందిస్తారని తహసీల్దార్ తెలిపారు.

● నూజివీడు టౌన్ : రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు ఆదివారం నుంచి చౌక డిపోల ద్వారా పంపిణీ చేస్తారని తహసీల్దార్ జి.భద్రు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్ద రేషన్ డీలర్ సరుకులను అందజేస్తారన్నారు.

మూడు హైస్కూళ్లలో హెచ్‌ఎంల బాధ్యతలు

చాట్రాయి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు జడ్పీ హైస్కూల్స్‌కు పదోన్నతిపై ప్రధానోపాధ్యాయులను నియమించినట్లు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు. చనుబండ హైస్కూల్ హెచ్‌ఎంగా ఎం.రవీంద్రనాథ్, పోలవరం హైస్కూల్ హెచ్‌ఎంగా ఆర్.శ్రీనివాసరావు, మర్లపాలెం హైస్కూల్ హెచ్‌ఎంగా అప్పారావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు రవీంద్రనాథ్, శ్రీనివాసరావు, అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు సాధించటానికి అంకితభావంతో కృషి చేస్తామన్నారు.



కొత్త హెచ్‌ఎంలతో ఎంఈవో బ్రహ్మాచారి

ఎక్సైజ్ దాడుల్లో పలువురిపై కేసులు

చింతలపూడి, మే 31(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి తలార్లపల్లికి చెందిన డి.శివపార్వతికి చెందిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. పంతంగులగూడెం గ్రామానికి చెందిన డి.ఇందిర అనే మహిళపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ అశోక్ తెలి పారు. వెలగపాడులో పరారీలో ఉన్న నిందితుడు గట్టు చక్రీని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. నాగిరెడ్డిగూడెంలోని అవుట్‌పోస్టును ఆకస్మిక తనిఖీ జరిపి ఆ గ్రామంలో సారా నిర్మూలన కోసం గస్తీ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



అల్లుకున్న పాదులు తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాట్రాయి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం కోనేరు రంగారావు కాలనీలో కరెంట్ స్తంభానికి అల్లుకున్న పాదులను శుక్రవారం విద్యుత్ అధికారులు తొలగించారు. వృక్షం కాదు.. విద్యుత్ స్తంభం శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంతో కాలంగా ఉన్న సమస్య 'ఆంధ్రజ్యోతి' చొరవతో పరిష్కారం కావటం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహిళల భద్రతకు శక్తి యాప్

ఏలూరు క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో మహిళలు, విద్యార్థినుల భద్రత అత్యంత ముఖ్యమని ఇందుకోసం పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నారని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు శక్తియాప్‌పై నగరంలోని సీడాప్‌ఫిల్ కాలేజీలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ శక్తియాప్ ద్వారా తక్షణమే పోలీస్ సహాయాన్ని పొందగలుగుతారన్నారు. శక్తియాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే పరోక్షంగా తమతో పోలీసులు ఉన్నట్టేనని, నిమిషాల వ్యవధిలోనే పోలీస్ సాయం అందుతుందన్నారు.

తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేయాలి

కలిదిండి, మే 31(ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు కృష్ణారావు, అజయ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెరువుల్లో బ్లీచింగ్ చల్లించే విధంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ కుళాయిల వద్ద నిల్వ నీరును తొలగించాలన్నారు. డ్రెయినేజీల వద్ద పైపులైన్ లీకేజీలను అరికట్టాలన్నారు. రక్షిత నీటి పథకాల ద్వారా సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు.

'ఫిషరీస్ డిప్లామా'.. దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి డిప్లొమో ఇన్ ఫిషరీష్ సైన్సస్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వ మత్స్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలోని భావదేవరపల్లిలోని మత్స్య యూనివర్సిటీకి అనుబంధంగా ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ డిప్లొమో కోర్సులో ఎస్‌ఎస్‌సీ దానికి సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. అర్హులైన విద్యార్థులు జూన్ 20 వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.సుగుణ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఫారా ఫిషరీస్ సిబ్బందిని అందుబాటులోకి తెచ్చేందుకు రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఈ డిప్లొమో కోర్సును నిర్వహిస్తున్నారు.

మండవల్లిలో ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత

మండవల్లి మే 31 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణపై ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మండవల్లిలో శనివారం నిర్వహించిన కళాజాత పలువురిని ఆకట్టుకుంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిర్వహించిన కళాజాతలో ఎయిడ్స్ వల్ల వచ్చే అనర్థాలను కళా రూపంలో వివరించారు. జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఐసీటీసీ సెంటర్లు ఏఆర్టీ మందులు, పీపీటీసీ కేంద్రాలు మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు రక్తదానం తదితర విషయాలపై గుడివాడకి చెందిన ఎం.శేఖర్‌బాబు అండ్ పార్టీ కళాకారుల వీధి నాటిక కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు.



వడాలిలో రేణుక అంకమ్మ తల్లి జాతరలో భక్తులు

కోలాహలంగా రేణుక అంకమ్మ జాతర ప్రారంభం

ముదినేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం వడాలిలో వున్న రేణుక అంకమ్మ జాతర మహోత్సవాలు శనివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఆచార సంప్రదాయం ప్రకారం మారగాని వంశీయులు జాతరలో పాల్గొని అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని రేణుక అంకమ్మ ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వెంకటాపురం పోస్ట్‌మెన్ ఆరోగ్య స్వామిని సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

పోస్ట్‌మన్ శ్రీనివాస్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

కలిదిండి, మే 31 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం పోస్ట్ ఆఫీసులో 29 ఏళ్లగా సేవలందించిన పోస్ట్‌మన్ ఎం.ఆరోగ్యస్వామిని సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, గ్రామస్థులు శనివారం ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రజలతో మమేకమై అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుడిపాటి శ్రీరామకృష్ణ, మురళీభాస్కర్‌కృష్ణ, ఆర్.సూర్యఫణి కుమార్, ఇంటి సుధాకర్, దేశి నాగబాబు, మారగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.